# రైతు బంధు రంగా

Lonely Furrow (రంగా) ఒంటరి సేద్యం



(శంకర్స్ వీక్లీ)

ప్రకాశకులు

డాక్టర్ జేక్కంపూడి సీతారామారావు

## జాస్తి వేంకట నరసయ్య



జననము 1910 ఆగష్టు 2. జన్మస్థానము కావూరు. స్వగ్రామము పెదపూడి, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా. తల్లి శేషమ్మ. తండ్రి సుబ్బయ్య, పౌరాణికులు. 1930–42 జాతీయ ఉద్యమాలలో పాల్గొని నాల్గు సంవత్సరాలు అప్పటి ప్రభుత్వముచే శిక్షింపబడి కారాగృహవాసము చేసిరి. 1935 న "ఉభయ భాషా ప్రవీణ (ఎ) పరీక్షలో ఉత్తీర్ణులు. వక్తలు. గ్రంథాలయ సేవకులు. భారతీ సమితి అధ్యక్షులు. పాఠ్య గ్రంథ రచయితలు. హిందీ వేత్తలు.



## ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము

జననము 1912 అక్టోబరు 15. జన్మస్థానము కంచర గొట్టిపాడు, నరసరావుపేట తాలూకా, గుంటూరు జిల్లా. తల్లి ఆదిలక్ష్మమ్మ. తండ్రి వేంకటేశ్వర్లు. స్వయంకృషిచే 1947 న "విద్వాన్" పరీక్షలో 1954 న బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులు. పాఠ్య గ్రంథ రచయితలు. కళారాధకులు. సరసులు. హిందీ వేత్తలు.

# రైతుబంధు రంగా

మొదటి భాగము రచయితలు

**కీ॥శే॥ జాస్తి వెంకట నరసయ్య**

**కీ॥శే॥ ధూళిపాళ వేంకటసుబ్రహ్మణ్యము**

రెండవ భాగము రచయిత

**డా॥ నాగభైరవ ఆదినారాయణ**


ప్రకాశకులు

**డా॥ జేక్కంపూడి సీతారామారావు**

**రైతుబంధు రంగా**

ప్రధమ ముద్రణ : నవంబరు 7, 2015

ప్రతులు : 500

వెల : రూ. 70/-

**ప్రతులకు :**

డా॥ జక్కంపూడి సీతారామారావు
4/1, అశోక్‌నగర్, గుంటూరు.
చరవాణి: 9849497739

డా॥ నాగభైరవ ఆదినారాయణ
205, సాయికృప టవర్స్,
6 వ లైను, కోబాల్టు పేట, గుంటూరు.
చరవాణి: 9849799711

**ముద్రణ :**

శ్రీ లక్ష్మీ ప్రెస్, 14/2, అరండల్‌పేట, గుంటూరు.
ఫోన్ : 2230643

# ముందుమాట

## నమస్సులు

కీ॥శే॥ జాస్తి వేంకటనరసయ్య గారు, కీ॥శే॥ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము గారలు నాకు చిలకలూరిపేట, ఆర్.వి.యస్. సి.వి.యస్. ఉన్నత పాఠశాలలో 1952 నుండి 1956 వరకు తెలుగు భాషోపాధ్యాయులు. ఇరువురు సౌజన్య మూర్తులు. నా పట్ల ఎంతో దయ చూపేవారు. నేను తెలుగులో ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉండేవాడిని. తెలుగు వక్తృత్వంలో కూడా కొన్ని బహుమతులు పొందగలిగాను.

జాస్తి వేంకట నరసయ్యగారు బ్రహ్మచారి. ఆయన తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి గారికి బంధువులు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని నాలుగేళ్ళు చెరసాలలో ఉన్నారు. చిలకలూరిపేటలో హాస్టలులోనే ఉండేవారు. నావంటి విద్యార్థులు ఎవరు ఎప్పుడు వెళ్ళినా, వారికి పాఠ్యాంశాలే గాక జీవితానికి ఉపయోగపడే అంశాలను చెప్పేవారు.

శ్రీ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం గారిది, మా గ్రామమునకు (పసుమర్రు చిలుకలూరిపేట మండలం) మూడు మైళ్ళ దూరంలో వున్న కంచర గొట్టిపాడు. కీర్తిశేషులు వారణాసి వేంకటేశ్వర్లు మొదలైన ఉద్ధండ పండితులు ఈ గ్రామములో ఉండేవారు. వీరు ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో విద్యార్థులను పలుకరిస్తూ ఉత్సాహపరుస్తూ ఉండేవారు. వీరిని నేను 1969లో సత్కరించాను.

వీరిరువురు బహు గ్రంథకర్తలు. వీరు వ్రాసిన "రంగాకథ" ఒక నెల రోజుల క్రితమే శ్రీ అన్నే సాంబశివరావు గారి వద్ద శిధిలావస్థలో దొరికింది. దొరికిన వెంటనే ఈ గ్రంథమును ప్రచురించవలెనని తలచాను. ఈ గ్రంథాన్ని ఆది నారాయణ గారికి చూపించి అభిప్రాయం అడిగాను. గ్రంథం సరళ గ్రాంథికంలో చక్కగా ఉందని 1950 తరువాతి రంగా గారి జీవితాన్ని గురించి కూడా ఈ

గ్రంథంలో పొందుపరిస్తే సమగ్రంగా ఉంటుందని అన్నారు. ఈ సలహా నాకు నచ్చింది. వారినే వ్రాయమని అడిగాను. వ్రాసి ఇచ్చారు. వారికి నా కృతజ్ఞతలు.

నా అభిమాన గురుదేవులు రచించిన భాగం సరళ గ్రాంధిక భాషలో సాగింది. కాలోచితమైన వ్యావహారిక భాషలో రెండవ భాగ రచన కొనసాగింది.

ఇది రంగా గారి సంపూర్ణ జీవిత చిత్రణ కాదు. సంక్షిప్త చరిత్ర మాత్రమే. దీనికి అనుబంధంగా రంగా గారి రచనల పట్టిక, వారి జీవితంలోని ముఖ్య ఘట్టములు, రంగా గారి గురించి ప్రముఖులు రచించిన కవితలు చేర్చాము.

గ్రంథ ద్వితీయ భాగాన్ని రచించడానికి అవసరమైన పుస్తకాలు ఇచ్చిన బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయానికి ముఖ్యంగా శ్రీ లంకా సూర్యనారాయణ గారికి, శ్రీపెద్ది సాంబశివరావు గారికి ధన్యవాదములు తెలుపుకుంటున్నాను.

ఈ గ్రంథంలోని మొదటి భాగాన్ని ప్రచురించిన "భారతీ సమితి, పెదపూడి, గుంటూరు జిల్లా" వారికి నా ధన్యవాదములు.

రంగా గారిపట్ల నాకున్న అభిమానానికి ఉపదగా వారి జన్మదిన సందర్భముగా దీనిని ప్రచురిస్తున్నాను.

**– జెక్కంపూడి సీతారామారావు**

# మొదటి భాగము

శ్రీ మంతంబగు ధారణీవలయంబు నందలి జీవరాసుల కెల్ల నాహార మత్యావశ్యకము. అందును జ్ఞానమాత్రాధికుఁడగు మానవునకుఁ దినుటకుఁ దిండియుఁ గట్టుటకు గుడ్డయు నవసరములు. ఆహార, వస్త్రాదికముల యుత్పత్తికి వ్యవసాయమే యాధారము. అట్టి వ్యవసాయమును సాగించువాఁడు రైతు. కావునఁ బ్రపంచమెల్ల రైతుపై నాధారపడి యున్నది.

అనాదినుండియు మన భారతవర్షమున వ్యవసాయము ముఖ్యవృత్తి. అందులకు దేశసహజస్వభావ మెంతయు ననుకూలించుచున్నది. శీతోష్ణస్థితియు, సర్వకాలములయందును, సమృద్ధ జలప్రవాహములతో నొప్పారు గంగ, సింధు, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్నాది నదులును ఈ దేశమందలి వ్యవసాయాభివృద్ధికి దోహదమొసంగు చున్నవి. ప్రపంచఖ్యాతి గాంచిన మేలురకపు పశుసంతతికిఁ గూడ మనభూమి మనికిపట్టు. కావుననే మన దేశమునందు నూటికిఁ దొంబది మంది రైతులు.

ఒకనాఁడీ దేశమున రత్నాల రాసుల పండించినాడు రైతు. సమస్త సంపదలతోఁ దులఁదూగినాఁడు రైతు. దేశీయార్థిక జీవనమునకు వెన్నెముకఁగా నిలిచినాఁడు రైతు. కానీ, రాజకీయముగా వెనుకబడి పారతంత్ర్యమునఁ జిక్కిన నాఁటనుండియు రైతుస్థితి నానాఁట క్షీణించుచున్నది.

సీ॥ ఎండ వానల కోర్చి ఏఁడాది పొడవున
చెమటోడ్చి సేద్యంబు చేయుచుండు
భూమాతనే నమ్మి ప్రొద్దుగ్రుంకెడి దాఁక
మట్టిలో పొర్లాడి మాఁడుచుండు
ఇల్లు వాకిలి వీడి ఎల్ల వేళలయందు
పనుల కొట్టాలలో పండియుండు
మెఱుగన్న మెట్టిదో మెసవుటే ఎఱుఁగక
గొడ్డుకారపు కూడె కుడుచుచుండు

శ్రమకు ఫలితమ్ముగా ధాన్యరాశి రాఁగ
దాని భూస్వామికిని ఋణదాత కొసఁగి
శిస్తుకట్టంగ పెండ్లాము పుస్తె మిగుల
బ్రతికి యున్నాడు రైతు జీవచ్ఛవముగ

ఉ॥ ఉన్న దఖండభూమి జనమున్నది నల్వదినాల్గుకోటు లే
మున్నను కూడుగుడ్డల కయో! యని కుందుచునుంటె గాని వే
ఱున్నదె దిక్కు లేక పడియుండిన దీనుల నుద్ధరించు వా
రున్న గదా! సముజ్జ్వల మహోన్నతి గాంచుట దేశ మక్కటా!

అట్టి నేఁటి రైతుల దుస్థితిని గన్నులారఁగాంచి, పేదవడి, బక్కచిక్కి, కష్టించి, కృశించు రైతుల దురవస్థలకు నాక్రోశమును జెంది రైతు భవిష్యత్తును నిర్ణయించి, వారల నుద్ధరింపఁ గంకణము ధరించిన జాతీయ నాయకులలో ఇరువదవ శతాబ్దమునఁ దన సర్వశక్తుల ధారవోయుచుఁ బ్రసిద్ధి కెక్కినవాఁడు ఆచార్య యన్.జి. రంగ.

ఉ॥ దీనుల నుద్ధరించుటకు ♦ దీక్షను బూని నిరంతరమ్ము న
జ్ఞాన తమంబుఁ బాపుటకు ♦ జాతికి నూతన విద్య నిచ్చి దే
శాన దరిద్రమానవుల ♦ సాయము సేసినవాఁడు ధన్యుఁడౌ
మానవసేవయే జగతి ♦ మాధవసేవ గదా తలంపఁగన్.

☆ ☆ ☆

గోగినేని రంగనాయకులు ఆంధ్రుడు. గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని నిడుబ్రోలు ఆయన నివాసస్థానము.

నిడుబ్రోలు గ్రామమునందలి రైతు కుటుంబములలోఁ బ్రఖ్యాతిఁబడసినవి రెండువంశములు. ఒకటి గోగినేని, రెండు పాములపాటి. గోగినేని వంశభూషణుఁడై నాగయాఖ్యుఁడొకరుఁడుండెను. ఆతఁడాస్తికుఁడు. దైవభక్తిపరుఁడు. వినయాది సద్గుణ గణవరిష్ఠుడు. ఆతని ధర్మపత్ని పాములపాటి వంశోద్భవ, సచ్చరిత్ర అచ్చమాంబ. వారిది కూడుగుడ్డలకు లోపములేని సామాన్యమైన రైతు కుటుంబము. ఆ పుణ్య దంపతులకు 1900 సంవత్సరము నవంబరు 7వ తేదీన మన రంగా జన్మించెను. వారికీతఁడే ప్రథమ సంతానము. పిదప వేంకటప్పయ్య, లక్ష్మీనారాయణ లను వారిరువురు జననమందిరి. నాగయ్య గారికీ ముప్వురే బిడ్డలు.

పూవునకు జన్మచేతనే తావి యబ్బును. రంగా కేఁడాది నిండకముందే దేశాచారము ననుసరించి, 'అన్నప్రాశనము' నొనరించిరి. ఆ సమయమునఁ బాయసమును వెండి గిన్నె యందుంచి మేనమామచేత బంగారు వస్తువులతో నా పాయసమును బిడ్డ నాలుకపై రాయింతురు. అంతియేకాక యొక పీటపై బంగారునగ లొకదెసను, పుస్తకములు, కలము, సిరాబుడ్డి మఱియొకవంక నుంచి, పారాడు చుండెడి పసిబిడ్డను నావైపు వదలుదురు. అప్పుడా బుడుతఁడేది తాఁకిన నా సంబంధమగు వృత్తి వ్యాపారాదులం దాతఁడు జీవిత యాత్ర గడపుకొనునని పెద్దల నమ్మకము. అట్టి సమయమున మన రంగా ధగధగ మెఱయుచుండు నగల దెస కరుగక నేరుగ పుస్తకముల వైపునకుఁ జని వానిని గైకొనెను. నాఁడే రంగా గొప్ప విజ్ఞానవేత్తయగునని పెద్దలు మురిసి కొనిరి.

దేశ సంప్రదాయానుసారముగ నాగయ్యగారు మన రంగాను గ్రామ పాఠశాలయందుఁ జదువవేసిరి. అప్పుడు పల్లెటూరిబడులకుఁ బ్రత్యేకగృహములు లేవు. ఏ యుదారుని కొట్టముననో యొజ్జ కూరుచుండి తనచుట్టును మూఁగి యుండు శిష్యులకుఁ జదువు చెప్పుచుండెడివాడు. రంగాకా పాఠశాల వాతావరణము

నచ్చలేదు. అదియొక చీఁకటికోనేరుగా నుండెడిది. దుర్వాసనకు నిలయము. అందుకే రంగా బాల్యమునఁ జదువునందంత యాసక్తిలేక బడికి సరిగా పోవుచుండెడి వాఁడు కాదు.

చిన్నతనమున రంగాకుఁ జదువుటలో నిష్టము గల్గించుటకు వారి మేనమామ గారి యాప్తమిత్రులగు జంపని ఆంజనేయులుగారాబాలుని దగ్గఱఁగూర్చుండఁ బెట్టుకొని దేశభక్తులపై యభిమానము గలిగించు చుండెడివారు. ఆతఁడే యాతనికిఁ జదువునం దుత్సాహమును గలిగించెను.

ఇంతలో నాతని పదవయేఁట వాని తల్లి కాలధర్మమందెను. అంతట నాతనిని బెంచు భారము పెత్తల్లియగు మంగమ్మగారిపైఁ బడెను. పెత్తల్లికి సంతానము లేదు: భర్తయుఁ జనిపోయెను. కావున వీరి యింటియందే యుండి బిడ్డల నల్లారు ముద్దుగాఁ బెనుచుచుండెను. తల్లి లేని బిడ్డ లనిన గారాబ మెక్కువ గదా!

రంగాకు వీథిబడి యనిన రోఁత యనుపించెను గాని, పుస్తకములపై నతని కపేక్ష మిక్కుటము. ఆతఁ డెప్పుడు నేదియో యొక పుస్తకమును దీసికొని తమ కొట్టమునందలి చెక్క కూర్పుపైఁ గూరుచుండి చదువుకొను చుండువాడు. క్రొత్త పుస్తకము లనినఁ బ్రీతి. ఒకనాడుఁ తన మేనమామ వద్ద నొక పెద్ద పుస్తకమును జూచెను. దానిని జదువవలెననుఁ గోరిక కలిగెను. తన పెత్తల్లినిఁ బుస్తకము తెచ్చిపెట్టు వఱకును గోకాడెను. పుస్తకమును గ్రహించి దానిని జదువునంత వఱకును నాతడు నిదురఁబోవలేదు, ఆ పుణ్య పుస్తకమే విజ్ఞాన చంద్రికామాలవారి "రాణీసంయుక్త".

☆ ☆ ☆

వెఱ పన్నట్టిది లేదు లేశ మయినన్ విద్యార్థి! నీ కీ భువిన్
కఱవే లేదు విశాల ధైర్యమునకున్ కామ్యార్థ సంప్రాప్తికై;
మిఱిపం బొప్ప స్వరాజ్యసిద్ధికొఱకై ముందే చనంజాలు నీ
సరి యెవ్వారలు భావిపౌరుడ! సుధీశాలీ! యువాగ్రేసరా!

ఆంగ్ల విద్యాభ్యాసమునందు దేశమునం దంతటను వ్యామోహము వెల్లివిరిసెను. ఆ గ్రామమునందును నాంగ్ల విద్యాసక్తి కలిగెను. పరిసర గ్రామమగు పొన్నూరున మాధ్యమిక పాఠశాల కలదు. పిదప నదియే యున్నత పాఠశాల చేయఁబడి నిడుబ్రోలు గ్రామము హద్దులలోనికిఁ దేఁబడెను. పదునాల్గవయేట రంగా యాపాఠశాలయం దారవతరగతిలోఁ (ఫస్టుఫారములో) బ్రవేశించెను. ఎట్లు చదువుచున్నావని తల్లి ప్రశ్నింపగా రంగా "అమ్మా! బాగుగనే చదువుకొనుచున్నాను. తరగతి యందు మంచి 'మార్కుల'ను బొంది 'మానేటరు'గా నుంటిననెను.

రంగా మూఁడు, నాలుగు ఫారములు చదువుచున్నప్పుడు వినయ విధేయతలతో నాదర్శప్రాయమగు జీవితమును గడపెను. ఆతనికి భాగవతమునందలి ప్రహ్లాద చరిత్రలోని పద్యము మనసునకు బట్టెను.

"తనయందు నఖిల భూతములందు నొక భంగి
సమహితత్వంబున జరుపు వాఁడు
పెద్దలఁ బొడఁగన్న భృత్యుని కైవడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావనఁజేసి మఱలువాఁడు
తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు

తే.గీ. సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాడు
లీలలందును బొంకులు లేనివాడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప"

అను ప్రహ్లాదునివలెఁ దన జీవితమును జక్కదిద్దికొనఁదలంచి రంగా నడవడిని సాగించుచుండెను. ఆనాడతడొక వేదాంతి. పండితుడు. భారతీయాచారముల

ననుసరించి, పిలకజుట్టునే పెట్టుకొని, నిత్యము వేకువను గ్రామ సమీపమునఁ బ్రవహించు తుంగభద్రాతోయముల స్నానము చేయుచుండెను. ప్రహ్లాదుని వలనే యాతఁడు బాల్యమునుండియుఁ బరస్త్రీలను దల్లుల వలె భావించుచుండెను. ఆ చిఱుత ప్రాయమునందు శ్రీ కందుకూరి వీరేశలింగముగారి బోధలందు రంగా మనసు లగ్నమయ్యెను. అప్పుడప్పుడు తోడి బాలకుల నొకచోఁ గూర్చి దైవభక్తిని, బ్రహ్మచర్యమును, స్వామి వివేకానంద, రామతీర్థాదుల జీవితములను గూర్చి బోధించుచుండెను. అప్పుడే 'స్వామి రామతీర్థ', 'రుద్రమదేవి' యను గ్రంథముల రచించెను.

"ప్రాణి లోకంబు సంసార పతిత మగుట
వసుధపై గిట్టి పుట్టని వాఁడు గలఁడె
వాని జన్మంబు సఫల మెవ్వాని వలన
వంశ మధికోన్నతి వహించి వన్నె కెక్కు"

పై తరగతులందుఁ జదువునపుడు రంగాకు విద్యయందభిలాష వృద్ధియగు చుండెను. ఆతడు రాత్రులయందు ప్రొద్దుపోవువఱకునుజదివి, మరల వేకువను మూఁడు గంటలకే మేల్కాంచి చదువుచుండెను. తాను చదువుకొనుటయేకాక పేదలగు విద్యార్థులకుఁ దగు సాయమును గావించుచుఁ జదివించెను. కొందఱఁ దనగృహముననే యుంచుకొనెను. మఱికొందఱకు వారము లొసఁగెను. వారికొఱకుఁ దానే జీతములఁ గట్టుచుండెను. అందులకుఁ దన యింటియందున్న ముడుపులను దెచ్చి యుపయోగించుచుండెను. అట్లు చదువుకొని, పైకి వచ్చిన వారిలో నొక రిప్పుడు న్యాయవాది.

విద్యార్థిగ నుండఁగనే రంగాకు మంచి గుణము లలవడెను. నాల్గవ ఫారము చదువునపుడు 'బిసెంటు డే' కు గ్రామములందు తిరిగి విరాళముల నాతఁడు వసూలు చేసెను. అప్పటినుండియే గ్రంథాలయసేవ ప్రారంభించెను. గ్రంథముల సేకరించి చిన్ని గ్రంథాలయమును నెలకొల్పెను. వైదికలపై నుపన్యసించుటయు నాఁడే ప్రారంభించెను. అపుడు జరిగిన కమ్మ మహాజనసభయం దాతఁ డుపన్యసించి పెద్దల మన్ననలకుఁ బాత్రుఁడయ్యెను.

రంగా ఈవిధముగ పవిత్రజీవితమును నడపుచు, అకలంక బ్రహ్మచర్యము నాచరించుచు, తన విద్యార్థిదశను గడపుచుండెను. 1920 సంవత్సరము మార్చియందు 'స్కూలు ఫైనలు' పరీక్షకుఁ గూరుచుండెను. అప్పుడే యాతని వివాహమునకు సంబంధములు వచ్చుచుండెను.

రంగా కుటుంబమునకుఁ బిత్రార్జితము నలువది యొకరముల భూమియు, ముప్పదివేల కవిలయుఁ గలదు. దానికిఁ దోడు మాతామహుల యాస్తి వారికి సంక్రమించినది. ఈ యాస్తికి దోడు రంగా, యాంగ్లవద్య నభ్యసించుచుండెను. ఇఁక నాతనికి గట్నముల నొసంగి, నలువదివేలు వరశుల్కము లిచ్చెద మనుచు నెన్నియో సంబంధములు వచ్చెను. కాని యవి యేవియు రంగాకు సమ్మతములు గాకుండెను.

తుదకు వారి గ్రామమునకు రెండు మూఁడు మైళ్ళ దూరమునందున్న మాచవరము నుండి సంబంధ మొకటి వచ్చెను. వధువు భారతీదేవి. పది సంవత్సరముల బాలిక; వెలగా సుబ్బయ్య, పిచ్చమ్మ దంపతులకు 1910లో శ్రావణ మాసమున నా బాల జననమందెను, తమ కదివరలోఁ గలిసిన సంబంధము గాకున్నను, కొలది కట్న మే యొసఁగినను మర్యాద నాశించి రంగా యా సంబంధమునకే తన సమ్మతిని జూపెను.

వివాహము నిశ్చయింపఁబడెను. ఇఁక నేమి? సర్వసన్నాహములు సమకూర్పబడెను. 1920 సంవత్సరము మే నెలలో మాచవరమునఁ కన్యదాతగారి గృహమున నతి వైభవముగాఁ బరిణయము జరిగెను. ఆ యేఁడే స్కూలు ఫైనలు పరీక్షయందు రంగా ఉత్తీర్ణుఁడాయెను. గుంటూరు కళాశాలలోఁ జేరెను.

రంగా విద్యార్థిగా నున్నప్పుడు పొలమునకు వెళ్ళుచు రైతుల కష్టసుఖములు కనులార గాంచు చుండెడివాడు. జంపని ఆంజనేయులుగారు రంగాను ఉన్నతహూణ విద్యాభ్యాసమునకు సీమకంపవలెనని రంగా తండ్రికి సలహానొసంగిరి. ఆ కాలమున రంగా కుటుంబమునకును, గ్రామ కరణము గారికిని తగాదా యుండెను. అందుచే

రంగా తండ్రి నాగయ్య ఆంజనేయులుగారితో “అయ్యా! పిల్లవానిని సీమకుఁ బంపినఁజాల ధన మగును గదా!” అని ప్రశ్నించెను.

“మీవాడు జిల్లా కలెక్టరగు” నని వారు సమాధాన మొసంగిరి.

అంత నాయమాయకుండగు రైతు “ఐతే కలెక్టరుగా వచ్చి యీ కరణాలు, తాశీలుదార్లనుండి మా రైతులను రక్షించగలడా? యని యడిగెను.

అందులకు వారు “బాబూ! కుఱ్ఱవానిని సీమకంపుము. ఈ చిల్లర ఉద్యోగుల కట్టడిజేసెడి యధికారి యగు” ననిరి.

అంత నాతఁడు “భేష్! అటులైన నెంత ద్రవ్యము వ్యయమైనను సరియే. మా వానిని సీమ కనుపుదు” ననెను. వెంటనే తగు ప్రయత్నములు చేసికొని రంగా యాంగ్లభూమికిఁ బయనమయ్యెను.

☆ ☆ ☆

అమరఁగ దేశముల్ తిరిగి అచ్చటి విద్యల నేర్చి వచ్చియున్
మమత స్వలాభమే కనక మానితులై కడు త్యాగమూర్తులై
క్రమముగ విద్యయున్ కాయము సర్వము దేశసేవకై
సమముగ ధారవోసిన విశాల యశుల్ గద దేశ సేవకుల్.

రంగా 1920లో యాంగ్లభూమినిజొచ్చి ‘ఆక్సుఫర్డు’ విశ్వ విద్యాలయమందు ‘ఐ.పి.యస్.’ పోటీ పరీక్షకుఁ జదువ నారంభించెను. ఆంగ్ల దేశమున ‘ఆక్సుఫర్డు కేంబ్రిడ్జి’ విశ్వవిద్యాలయములు విజ్ఞాన ప్రపంచమున మన ప్రాచ్యఖండము నందలి తొల్లిటి నలందా, తక్షశిల, అమరావతి విశ్వవిద్యాలయముల వలె విఖ్యాతి గాంచినవి. ఆ విశ్వవిద్యాలయములయందే మన జాతీయ వీరులెందరో యుత్తీర్ణులైరి. జాతీయ సమరాంగణమున గాంధీ మహాత్మునకుఁ గుడిభుజముగా నిలిచిన మహమ్మదాలీ ‘ఆక్సుఫర్డు’ విశ్వవిద్యాలయమున నారితేరినవాఁడే. నేటి మన భారత ప్రధాని జవహరులాలు ‘కేంబ్రిడ్జి’ విశ్వవిద్యాలయం నందుత్తీర్ణుఁడైన వాఁడే. అట్టి విశ్వవిద్యాలయమందే మన రంగా విజ్ఞాన సముపార్జనకుఁ బ్రవేశించెను.

అచట జదువు కాలముననే తన స్వగ్రామమందు తాను, తన బాల్యమిత్రుఁడు పాములపాటి వేంకటకృష్ణయ్య గారు కలిసి స్థాపించి, కృష్ణయ్య గారిచే నడుపఁబడుచున్న 'రైతు' పత్రికకు రంగా వ్యాసములు పంపుచుండెను. అదియే భారత రైతు పక్షమున వెలువడిన ప్రథమ రైతు వారపత్రిక. తన యింగ్లాండు పయనమునకు మున్నే దాని ప్రకటనకుఁ దగిన యేర్పాటులు గావించెను.

రంగా తన సంరక్షకుడుగ, మిత్రుఁడుగ నుండిన వి. రామకృష్ణ (ఐ.సి.యస్.) గారి సాయమున ఆక్సుఫర్డులోని సెంటు కేథరిన్సునందుఁ ప్రవేశించి ఐ.సి.యస్.కుఁ జదువుచున్న కాలముననే మన భారతదేశమున 1921లో గాంధీగా రసహాయోద్యమమును బ్రారంభించిరి. ఆ జాతీయ సంరంభ ప్రభావ మింగ్లాండులోని భారత విద్యార్థి యువకులకును సోఁకెను. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమమునఁ గారాగృహమున నాఱునెలలు కఠినశిక్ష అనుభవింప నేఁగె నను వార్త వినగనే మన రంగా ఐ.సి.యస్. చదువునకు స్వస్తి చెప్పక యుండజాలక పోయెను.

అతడు మఱుసటి వత్సరము తన విద్యా విధానమును మార్చుకొని తన యభిమాన విద్యను గణిత శాస్త్రమునుండి యార్థిక శాస్త్రము, రాజకీయశాస్త్రముగా మార్పునొందించు కొనెను. కాని యాతని గణిత శాస్త్రాభ్యసనము వాని భావి జీవితమునందలి గ్రామముల యార్థిక జీవన పునర్నిర్మాణమున కెంతయు సహాయక మయ్యెను.

రంగా 1922లో 'ఆక్సుఫర్డు' లోని 'బార్నెట్ హౌస్' లో సాంఘిక శాస్త్రమును పఠించెను. అచట కొందఱాంగ్లేయ మిత్రుల సలహానుసరించి యింగ్లీషువారి కార్మికుల సాంఘికార్థిక పరిస్థితులు తెలిసికొనుటకై బ్రిటీషు సామ్రాజ్య ప్రధాన నగరమగు లండనులోని 'టాయన్ బిహాలు' నందు కొంతకాలము వసించెను. అపుడే ప్రఖ్యాత బ్రిటీషు కార్మిక రక్షణ సంఘోద్యమ స్థాపకుఁడగు జే.జే. మాల్లన్ గారి పరిచయము చేకూఱెను. రంగా ఆ సంవత్సరము వేసఁగియందు 'బాంగోరు' స్కార్‌బరో, నగరములందలి వేసంగి పాఠశాలల కరిగి యచటి సోషలిష్టు కమ్యూనిష్టులతోఁ బరిచయముఁ జేసికొనెను. ఆ వేసంగి పాఠశాలలయందే

దత్తుసోదరులు జి.డి.హెచ్.కోలు, హెచ్.ఎన్. బ్రెయిల్సుఫర్డు మున్నగు విఖ్యాత సామ్యవాదుల నేస్తమున సామ్యవాదము నందలి ముఖ్య సిద్ధాంతముల నవగాహన మొనర్చుకొనెను. నేటికిని బ్రెయిల్సుఫర్డు, కోలు, రంగా మిత్రులై యాయనయొక్క రాజకీయ సూత్రముల వైదగ్ధ్యమును గొనియాడు చుందురు. బ్రెయిల్స్‌ఫర్డు సలహానను సరించి 1922 వేసంగియందు రంగా ఇటలీ, జర్మనీ, ఫ్రాంసు, దేశముల సంచార మొనర్చెను. ఆయా దేశములందలి రైతు సంఘములు సామ్యవాదము ననుసరించి నెలకొల్పిన సహకార సంఘములను గూర్చి యాతఁడు నేర్చుకొనవలెనని కుతూహలపడెను. అటులనే తన సంచారమునందు కార్మిక సహకారోద్యమముల గుఱించి రంగా సమగ్రమముగ నెఱింగి 'జనీవా' యందు కొంతకాలము 'నానారాజ్య సమితి' అంతర్జాతీయ కార్మిక కార్యాలయములందుఁ బనిచేయుచు వారి సేవాకార్యముల నర్థము చేసికొనెను. అతఁడప్పటి ఇటలీయందు ఫాసిస్టు లెటుల సోషలిస్టు, కమ్యూనిష్టు శక్తుల నతిక్రూరముగ నెదిరించుచుండిరో కన్నులారగాంచెను. అప్పటినుండి ఫాసిస్టు శక్తులపై విపరీతమైన కోపము పెరుగుచున్నది. రంగా ఆంగ్ల దేశమున మూఁడు సంవత్సరములుండి రాజకీయ ఆర్థిక శాస్త్రపండితుఁడను పట్టమును గైకొని 1923లో మాతృ దేశమునకుఁ దరలి వచ్చెను. ప్రభుత్వోద్యోగమందుఁ జేరుట కాతని కేమాత్రము కోరికలేదు. రషియాలో నెటుల కూలీల రాజ్య మేర్పడినదో అటులనే మన దేశమున రైతుకూలీ రాజ్యము స్థాపింపవలెనని యాతని పట్టుదల.

☆ ☆ ☆

రంగా భారతదేశమునకు వచ్చిననాటనుండియు 'రైతు' ఉద్యమమును ప్రారంభించెను. ఆయన గాంధీగారి బోధనలచే స్వాతంత్ర్య తృష్ణను గలిగియున్న భారత "రైతాంగము" నందుఁ బ్రబోధము గావించి రైతు మహాసభలను జరుపు చుండెను. అట్టి మహాసభలలో అప్పికట్ల రైతు మహాసభ దిగ్విజయముగా జరిగెను. అందే కాంగ్రెసువాదుల సహకారము నంది రైతుల యెన్నికల ప్రణాళికను దయారు చేసెను. రంగా అందు కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమముతో పాటు సామ్యవాదమునకుఁ

బునాదు లగు భూమిశిస్తు, పన్నులు, పరిశ్రమాభివృద్ధులను గూర్చిన కార్యక్రమమును జొప్పించెను. ఈ రైతు సంఘములు కాంగ్రెస్ వ్యతిరేక సంస్థలగు నని కొందఱు కాంగ్రెస్ వాదులు సంశయించిరి. కాని రంగా తన దృఢతర విశ్వాసమును వీడక రైతు సంఘోన్నతికిఁ బాటుపడెను.

రంగా వ్యవసాయ కూలీలను గుఱించియుఁ బ్రయత్నములు సేసెను. 1923లో జిల్లా వ్యవసాయ కూలీల సభను నిడుబ్రోలు నందు సమావేశ పఱచెను. ఇట్టి సభ హిందూ దేశమునం దిదియే ప్రథమము. దాని కాతఁడే యధ్యక్షత వహించెను. కారణాంతరములచే రైతు మహాసభల వలె నీ సభలు అప్పుడు ప్రయోజనమునకు రాలేదు. ఈ విధమగు దేశసేవ యొనర్చుచు నాతఁడు పుగాకు వర్తకమును నింగ్లాండుతోఁ జేయుచుండెను. గుంటూరుజిల్లా పుగాకు పంటకుఁ బ్రసిద్ధి. రంగా ఈ సందర్భమున లెక్కలను సరిజూచుకొని వచ్చుటకై యింగ్లాండున కరిగెను. 1923-26 ల మధ్య ఇంగ్లాండున కాతఁడు మఱి రెండు పర్యాయము లరిగెను.

1925లో వెళ్ళునప్పుడు తన సతీమణిని గూడ వెంటఁ దీసికొని పోయెను. చదువు నిమిత్తము విదేశముల కేఁగిన మొదటి "రైతాంగన" యామెయే. రంగాయొక సంవత్సరమామె నచటఁ జదివించెను. దక్షిణ హిందూదేశపు ప్రత్తి పరిశ్రమను గురించి 'The Economics of the Handloom' చేనేత పరిశ్రమను గూర్చిన యార్థిక నీతిని దెలుపు (Thesis) సిద్ధాంతమును బ్రకటించినందున ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయము వారు రంగాకు 'బి.లిట్.' బిరుదము నొసంగి గౌరవించిరి.

☆ ☆ ☆

రంగా అట్టి గౌరవమును బొంది సతీద్వితీయుఁడై మాతృభూమికిఁ బయనమయ్యెను. వారొక పొగయోడపైఁ బయనమైరి. ఓడ అడుగుభాగము గంధకముతో నింపబడియుండెను. వారు పయనించుచుండిన ఆ యోడ జిబ్రాల్టరు జలసంధి నధిగమించి మధ్యధరా సముద్రమునుఁ జొచ్చెను. పలు దేశముల నుండి వచ్చెడి ప్రయాణీకులెందఱో యందుఁ గలరు. కొందఱు రాజకీయములఁ

జర్చించుకొనుచుండరి. మఱికొందఱు మధ్యధరా శీతోష్ణస్థితిని, యందలి వివిధ ఫల వృక్ష సంపదనుఁ జర్చించుకొనుచుండిరి. ఇంకను గొందఱు తమతమ దేశౌన్నత్యమును ముచ్చటించు కొనుచుండిరి. మన రంగా దంపతులు నేదియో యిష్టాగోష్ఠిగాఁ గాలమును వెళ్ళబుచ్చుచు సంతోషించుచుండిరి.

ఇంతలో నోడ ప్రధానాధికారి (Captain) తో నౌక యాంగ్లేయుడు వాదించుచుండుటను వారు గాంచిరి. ఆ యాంగ్లేయుడు క్రింది గంధకమునకు నిప్పంటు కొనెననియు కొలది కాలమునఁ బ్రమాదము సంభవించుననియు నుడువు చుండెను. ఆ యోడ యధికారి మఱేమి ఆపద లేదని ధైర్యము సెప్పుచుండెను. రంగాగారును మఱికొందరు ప్రయాణీకులును నచటి కరిగి యోడయధికారితో వాదులాడి యోడయంతయుఁ బరిశీలించుచుండిరి. ఎట్టకేలకొక యెడ గంధకపు పొగ వారికిఁ గనుపించెను. ఇంతలోననే యోడయందు భగ్గున జ్వాలలు రేఁగెను. ప్రయాణీకులందఱు గొల్లున గోలఁజేయ మొదలిడిరి. నాఁటితోఁ దమ యసువులు పోవునని తలంచిరి.

ఓడ సాధారణముగాఁ జిన్న గ్రామమంత యుండును. మగవారెల్లరును గాలుచున్న వైపునువీడి మఱియొక దెసఁ జేరిరి. అపాయ సమయములఁ బ్రజల రక్షించుటకు నిలువ యుంచిన చిన్న బోట్లను (Life-boats) రబ్బరు చక్రములను సంద్రమున విడిచిరి. స్త్రీలందఱు వానియందుఁజేరి యాపారావార మధ్యమునఁ దేలియాడుచుండిరి. ఒకరిసంగతి యొకరికి లేదు. అంతయు నయోమయము.

అది ఈజిప్టు తీరమందలి జంబూద్వీపపరిసర ప్రాంతము. వారు వెంటనే యీ ప్రమాదవార్తను నిస్తంత్రీ వార్త (Wireless) మూలమున తీరమునకుఁ దెలియజేసిరి. అతిరయంబున వీరి రక్షింప నోడయొండు గుప్పుగుప్పున ధూమమును విడచుచు నట కరుదెంచెను. ప్రయాణీకుల ప్రాణములు లేచివచ్చెను. వారు భగవానుఁడు తమను రక్షింప నారూపమున వచ్చెనని యానందించిరి. అందఱును సురక్షితముగ జంబూతీ నగరమునకుఁ జేర్పఁబడిరి. రక్షింపబడిన స్త్రీల నామముఁ దెలుపు పట్టికలను వెలువఱచిరి. వారుండు గదులసంఖ్యల నెఱింగి తమతమ యాఁడువారిని

పురుషులందఱుఁ గలసికొనుచుండిరి. రంగా భారతీపేరును పట్టికయందుఁ జదువుకొని యామె యున్న చోటునకు వచ్చెను. తన భర్తను జూడఁగనే యా భారతీదేవి యమందానందమున దరహసితవదనయయ్యెను. రంగా యామెను బ్రేమపూర్వకముగా దఱిఁ జేర్చుకొనెను. వాని కనుగొనలనండి ముత్యపుబిందువుల వలె నానందాశ్రువు లామె ముఖకమలముపైఁబడెను. తన ప్రాణనాథుని దనకు మరల లభింపఁ జేసినందులకు భారతీదేవి భగవంతునికిఁ గృతజ్ఞత దెలిపెను.

☆ ☆ ☆

1926 లో రంగా స్వదేశమున జేరుకొనెను. అంతదనుక కాంగ్రెసు సభ్యుఁడుగ నుండెను. కాని రంగా కాంగ్రెసులోని యార్థిక కార్యక్రమము నచ్చనందున కాంగ్రెస్ నుండి విరమించుకొనెను. అయినను మరి యే యితర కక్షల యందును జేరక రైతుజన సముద్ధరణకే పాటుపడుచుండెను. ఆతఁడు పెదవడ్లపూడి, రేటూరు, అప్పాపురం ప్రాజక్టుల నిర్మాణమునకై కృషిచేయుచు 1934 నకు అందుఁ గృతకృత్యుఁ డయ్యెను. ఇందుచే ఆ రైతులకు నాల్గుకోట్లు అధికాస్తిపాస్తులు లభించినవి. 65000 యకరములు మాగాణి మయ్యెను. ఆ కాలమున నాతఁడు రైతులోకమునకుఁ గావించిన సేవ యపారము. రంగా గుంటూరు, కృష్ణా మండలము లందలి రైతు సమస్యలయం దత్యంత శ్రద్ధ వహించి రైతు బాంధవుఁడై మెలఁగెను. జిల్లా, తాలూకా రైతు సంఘముల నెన్నింటినో నెలకొల్పెను. భూమినే నమ్ముకొని నిరంతరము శ్రమించు పేదరైతుల జీవితసమస్యలను గూర్చి యెన్నియో వ్యాసములు రంగా నాఁటి వివిధ పత్రికల యందును బ్రకటించుచుండెను. ఇంగ్లాండు వెళ్ళకపూర్వమే రంగా రైతుల బాధా నివారణ మిక్కిలి యవసరమని తన తండ్రి నుండి ప్రాంతీయులగు రైతుల యనుభవములనుండి తెలిసికొనెను. ప్రజారాజ్యము కావలయునని హృదయ పూర్వకముగా నంగీకరించెను. కాని ఆ స్వరాజ్యము ధనవంతులకా లేక కష్టజీవులగు కర్షక కార్మికులకా యను సందేహ మాతనికి కల్గెను. హృదయమునకు శాంతి లేదు. ఇంగ్లాండునకు వెళ్ళిన పిదప రంగా లేబరు పార్టీనాయకులతో పరిచయముబొంది వారెట్లు కూలీ రాజ్యము స్థాపింపనెంచుచున్నారో తెలిసికొనెను.

మన దేశమునఁగూడ కిసాన్ మజదూర్ ప్రజారాజ్య స్థాపన చేయవలయునని నిశ్చయించుకొనెను. 1917లో రష్యయందు కూలీల రాజ్యము స్థాపింపఁబడినది. దానికి నాయకు లగు లెనిన్ మహాశయుని బోధనలను రంగా చదివెను. రష్యాయందు కార్మిక రాజ్య మేర్పడి జయప్రదముగా సాగింపఁబడుచుండ మనదేశము నందు మాత్ర మేల ప్రజారాజ్యమును స్థాపింపరాదు? అట్లు స్థాపింపబడినచో నది యెందులకు జయప్రదముగా నడువదు? ఈ యాలోచనలు వాని భావవీథియందు సంచరించుచుండెను. అందుచేతనే రంగ 1923 లోనే భారతదేశము నందు రైతు కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయవలయునను కృత నిశ్చయముతో మాతృభూమికి వచ్చెను. వచ్చిననాఁటనుండియు నాతఁడు దన యాశయసిద్ధికై దేశమునందు విరివిఁగా బ్రచారము సాగించుచుండెను.

☆ ☆ ☆

ఎన్.జి.రంగా. 1927 లో మద్రాసు నగరమందలి పచ్చయ్యప్ప కళాశాలయందు ఆర్థిక, సాంఘిక, శాస్త్రబోధనకు ప్రధానాచార్యుడుగాజేరెను. (Professor of Economics and Political Science) జేరెను. మాసమున కైదువందల రూప్యముల వేతనము. ఆతడు రాజకీయములయందుఁ బాల్గొనుటలో నభ్యంతరము సూపకుండునట్లు కళాశాలా నిర్వాహకుల వద్ద హామీని సైతము గైకొనియెను. రంగా 1927 మొదలు 30 వఱకును (Honours) 'ఆనర్సు' తరగతుల నున్నత విద్యార్థులను దయారుచేసెను. రంగా శిష్యులలో నొకరగు శ్రీ గోపాలరావుగారు తన ప్రతిభను జూపి 'కర్జను పతకమును' బహూకృతి నందెను. మఱొక్కరు డాక్టర్ శ్రీనివాసరావు గారు బెజవాడ కళాశాలకు (Principle) ప్రధానాచార్యులుగా నున్నవారు. వేఱొకరు మధ్యపరగణాల ప్రభుత్వమునకు (Advocate General) 'అడ్వకేటు జనరలు' గా ఉన్నారు.

1928-29 సంవత్సరమున నాచార్య రంగా మద్రాసు ప్రభుత్వపు టార్థిక పరిశీలనాసంఘ నిపుణుడుగా (Specialist) నియమింపఁడెను. పారితోషికము నభిలషింపకయే నీలగిరి, కోయంబత్తూరు, సేలము, గుంటూరు మండలములందు

రంగా ప్రభుత్వ పక్షమునఁ బరిశీలనను నెఱపెను. ఆయన నివేదికయందలి ప్రజల పేదఱికపు లెక్కలను జూచుకొని భయమంది దొరతనమువారా శాఖను, కార్యాలయమునుగూడ రద్దుపఱచిరి. తుద కా నివేదికను గూడఁ బ్రచురింపరైరి.

అయినను 1929-30 సంవత్సరమున గోదావరి, కృష్ణా రీ సెటిల్‌మెంటు విచారణ సంఘమునకుఁ గార్యదర్శిగాఁ బ్రభుత్వము రంగాను నియమించెను. దాక్షిణాత్యులలోని యార్థిక శాస్త్రజ్ఞులందఱు వారినే ప్రధానులుగా నెంచుటవలన నియమించక తప్పదాయెను. ఆ సంఘమునకు కీ.శే. దివాన్ బహదూరు ఆర్.యన్.ఆరోగ్యస్వామి మొదలియారుగా రధ్యక్షులు. జాతీయ వీరులైన సర్దారు నారాయణరాజందొక సభ్యులు. ఆ హోదాలో రంగా యా మండలము లందలి నూఱు గ్రామముల రైతుల ఋణముల గూర్చి విచారణ జరిపెను. ఆ సంఘము వారొక నివేదికను బ్రచురించిరి. అందులకుఁ గార్యదర్శిగారి బుద్ధికుశలతయు, సామర్థ్యమును నెంతయో యావశ్యకము లనుటలో నాశ్చర్యము లేదు.

మద్రాసు కళాశాలయం దాచార్యుఁడుగ నుండియే, 1929లో శ్రీ మాగంటి బాపినీడు, యం.యస్.సి. (కాలిఫోర్నియా) గారి సహకారముతో నాంధ్రరాష్ట్ర రైతుసంఘమును స్థాపించి దాని కధ్యక్షుడుగా రంగా యుండెను. ఆ సంవత్సరముననే రంగా మదరాసు రాష్ట్రమున అటవీ పంచాయతుల సంఘ కార్యదర్శిగా నుండి పదకొండు వందల పంచాయతు లందలి రైతులకు సౌకర్యము లభింప నుత్తరువు లిప్పించి వారి యాదరణకుఁ బాత్రుఁడాయెను.

రంగా ఆ కాలముననే గుంటూరు జిల్లా గ్రామపంచాయితీ సంఘాధ్యక్షుఁడుగాఁ బనిచేసెను. ఆతఁడు మండలములో గల తొమ్మిది వందల యఱువది గ్రామములలో నేడు వందల గ్రామములకుఁ బంచాయతుల నెలకొల్పెను. అది వఱకుఁ బ్రభుత్వమువారు గ్రామ పంచాయతులకు భూమిశిస్తు నుండి రూపాయకు మూఁడుపైస లిచ్చుచుండువారు. రంగా గ్రామ పునర్నిర్మాణావసరముల కది చాలదని దొరతనము వారితో వాదించి, యొప్పించి దాని నాఱుపైసలకుఁ బెంచు నటులఁ జేసెను.

ఆతఁడు మదరాసు ప్రభుత్వముచే నెలకొల్పబడిన మాగాణి వ్యవసాయిక సలహాసంఘమున కధ్యక్షుఁడుగా నెన్నుకొనఁబడి కృష్ణాడెల్టాలోని రైతులకుఁ జాల సహాయ మొనర్చెను. మరియు ఒంగోలు కఱవు బాధానివారణ సంఘమును స్థాపించి, రైతుల కపారసేవ నొనర్చెను. రంగా గుంటూరు మండల రైతు సంఘాధ్యక్షుడుగా నుండి యరువదియైదువేల యకరముల భూమి సాగుబడి యగునటులఁ నొనర్చెను. మఱియు ననేక గ్రామ గ్రంథాలయములు, సహకార పరపతి సంఘములు నెలకొల్పఁ దోడుపడెను.

☆ ☆ ☆

మ॥ బిరుదులు వీడి ఆర్జనలఁ బ్రీతి విసర్జనఁ జేసి సౌఖ్యముల్
పరమ ముదంబునన్ వదలి భారతదేశ స్వరాజ్య సిద్ధికై
పురుషత శాంతి యుద్ధమున పోరి శరీరము లాటుపోట్లకే
గుఱి యొనరించి జైళ్ళ బడి కోరి వరించిరి కష్టనష్టముల్

రంగా శాసనసభయందు 'రౌండుటేబులు' సమావేశము నెడ తన విముఖతను వెల్లడించెను. ఆతఁడు 1930 లో జరగిన మొదటి 'రౌండు టేబిలు' సమావేశము జరుగు సమయమున ఇంగ్లండున కరిగెను. ఆంగ్లభూమి కరిగి రంగా ఆ సభకు ప్రతికూలముగా నఖండ ప్రచారమొనర్చెను. కాంగ్రెసు కోరిన సత్వర స్వరాజ్యవాంఛ యెడఁ దన యనుకూల వాదనను వెల్లడించెను. ఆంగ్ల మిత్రులతోఁ గూడి రంగా యాంగ్లభూమి నంతయు గ్రుమ్మరెను. మరియు నచ్చటనుండియే 'హిందూ' బాంబే క్రానికల్ 'స్వరాజ్య' 'ఆంధ్రపత్రిక' లకు వ్యాసములు పంపుచు జాతీయతకు గట్టి పునాదు లేర్పరచుచుండెను.

ఇంగ్లండునందు నాతఁ డొనర్చిన కార్యమును గూర్చి యాతఁడే.

"నేను జైలునకుఁబోవని లోటును భర్తీ చేయుటకును, మహదాశయపూరిత మగు కాంగ్రెస్ సంస్థయందుఁ జేరుటకుఁ బ్రథమ శిక్షణముగను నీ సేవను జేయుచుంటి" ననెను.

ఆంగ్లభూమి నుండి వచ్చిన నాఁటనుండియు1931 లో నాతఁడు జమీందారీ రైతులయెడఁ దన దృష్టుల మరల్చెను. ఆంధ్ర జమీందారీ రైతుసంఘమును బునరుద్ధరించెను. ఆ వత్సరముననే వేంకటగిరిలో జరిగిన మహాసభలో రంగా గంభీరముగా నుపన్యసించి, "జమిందారీ విధానము నిర్మూలనము కావలె" నని మేఘ గంభీర ఘోషణంబున గర్జించెను. అతని కృషి ఫలితమే నేటి యా జమీందారీల రద్దు. జమీందారీ పద్ధతికి 1802లో జరిగిన (Permanent Settlement) శాశ్విత శిస్తు నిర్ణయము మూలమున బ్రిటీషువారు క్రొత్త ప్రాణమును బోసిరి. నాటినుండియు మనదేశపు రైతుల యిక్కట్లు మిక్కుటమగు చుండెను. జమీందారుల బిరుదములు, ధనబలములు గాంచి వారి పెత్తనమున కెవ్వరు నడ్డుచెప్ప సాహసింపరైరి. కాఁగా వారికి బ్రిటీషు ప్రభుత్వపు మద్దతు లభించుట వలన వారి దురాగతమునకు మేరయే లేకుండెను. అట్టితఱి కాంగ్రెస్ వారియందుఁగూడ నెవ్వరును వారి నెదిరింపఁజాలకుండిరి. కాని యారోజులయందే జమీందారుల క్రోధోద్ధతికి నిసుమంతయు జంకక 'జమిందారీలు నిర్మూలము కావాలి' యని యెలుంగెత్తి దశదిశాక్రాంత నిస్వనముఁ జాటినవాఁడు రంగా యొక్కడు. జమీందారీ సమస్యను లేవనెత్తిన మేటి యాతఁడే.

ఆ 1931 సంవత్సరముననే మఱియొక విశేషము తటస్థించెను. నాటి ప్రభుత్వమువారు ప్రజల యాందోళనా ఫలితముగా వారి కన్నీరుఁ దుడుచుటకో యన, భూమిశిస్తు లనుగూర్చి విచారణ సంఘమును నియమించిరి. కాని యా విచారణ సంఘమువారు శిస్తులను బెంచకూడదని సలహా వొసంగిరి. ఐనను ప్రభుత్వమువారు మాత్రము శిస్తులఁ బెంచుటకే నిశ్చయించుకొని విచారణ సంఘమువారి సలహాలను బెడచెవిని బెట్టిరి. రైతు బాంధవుఁడగు రంగా యీ వార్త వినిన వెంటనే ప్రభుత్వపు (Revenue Department) ఆర్థిక శాఖవారితోఁ బోరాడెను. ఈ యాందోళనమున నాతనికి బాపినీడు, నారాయణరాజు, కొమ్మారెడ్డి సత్యనారాయణ గారలు సహచరులుగా నుండి యుద్యమ తీవ్రతను నినుమడింపఁ జేసిరి.

బౌద్ధ వాఙ్మయబ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్య గారి సాయంతో కృష్ణాజిల్లాయందు మూడువందల గ్రామ రైతు సంఘముల స్థాపించిన రంగా సేవ నిరుపమానం. ఈతని ధాకకుఁ దాళఁజాలక ప్రభుత్వమువా రీతనికి సంవత్సరము జైలుశిక్ష నొసంగిరి. మఱి యేడుగురుగూడఁ జెఱబడిరి. ప్రభుత్వమువారు ఈ యుద్యమ ఫలితముగా కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి మండలములందుఁ బన్నుల నిరాకరణోద్యమమునకు సంబంధించిన (ఆర్డినెన్సు) అత్యవసరపు చట్టము నమలు పఱచిరి.

కార్యశూరులకు నిర్బంధమునం దుత్సాహ మతిశయించును. రంగా ప్రతినిత్య మెనిమిదిగంటలు పనిచేయుచు జైలులో నమూల్యములకు గ్రంథముల నాంధ్రాంగ్లభాషలో రచించెను. నానాదేశ ప్రభుత్వ విధానములను గుఱించి విమర్శనలు చేసెను.

☆ ☆ ☆

జైలు నుండి విడుదలైన పిమ్మట నాతఁడు విధివిరామము లేక ప్రజాసేవ చేయఁగలిగెను. రైతు యాత్రలను, సేవాదళములను నడపెను. రంగా రైతాంగము నందలి స్తబ్ధతనుఁ బోనడంచ వేసంగి పాఠశాలల నేర్పరచెను. ప్రజా సముదాయ మునకుఁ జైతన్యము గలిగింప దేశమునందుఁ బ్రప్రథమమున రైతాంగ విద్యాలయమును నిడుబ్రోలునందు నెలకొల్పిన దాతఁడే. మరియు రైతు ప్రబోధమునకు రంగా 'రైతాంగ భజనావళి' మున్నగు పాటల పుస్తకములఁ దయారు చేయించెను. ఈ విద్యాలయమును గాంచియే దేశమునం దన్నివైపులను రాజకీయ ప్రచారమునకు వేసంగి పాఠశాలలు బయలు దేరినవి. ఇతరుల నభివృద్ధికిఁదెచ్చు గుణము రంగాయందు మెండుగ నున్నది. నేడు రాజకీయములందు రచనలయందు ప్రసిద్ధులగు యువకులలో చాలమంది యొకప్పుడు రంగాగారి శిష్యులే.

రంగా 1931 సెప్టెంబరులో జరిగిన బొంబాయి కాంగ్రెసు సర్వసభ్య సమావేశమున కాంగ్రెసు ప్రధానహక్కుల ప్రణాళికయందు సామ్యవాద సూత్రములను జొప్పింఁప బోరాడెను. 1933లో పూనానగరమున కాంగ్రెసు

సామ్యవాద బృందమును స్థాపించెను. ఆతఁడు పాట్నా నగరమున జరిగిన 'కాంగ్రెసు సోషలిస్టు' సమావేశమునఁ బ్రధానపాత్ర నిర్వహించెను. శాసనసభల యెన్నికలను బహిష్కరింపవలె నను సూచననుమాత్ర మంగీకరింప జాలఁడయ్యెను. రంగా 1934లో "ఆంధ్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ" కధ్యక్షుడుగా నెన్నుకొనఁబడెను.

ఇంతలో కేంద్ర శాసనసభకు ఎన్నికలు వచ్చినవి. అందు రంగా కాంగ్రెసభ్యర్థిగా నిలచి యత్యధికమగువోట్లతో గెలుపొందెను. ఆతడు శాసనసభ యందున్నంత కాలము రైతుల సేమము కొఱకే పోరాడు చుండెను. అందులకు నిదర్శనముఁగా నాతఁడు శాసన సభ్యులనుండి రైతులనొక జట్టుగా వేరుపఱచెను.

ఆతఁ డెన్ని దినముల నుండియో అఖిలభారత కిసాను కాంగ్రెసును స్థాపింపవలెనని కలలు గనుచుండెను. అందులకై యాతడు 1935 ఆగస్టులో నొక సూచనఁ జేసెను. అక్టోబరు నెలలో మదరాసు నగరమున నాతని యగ్రాసనాధిపత్యమున నొక యఖిలభారత కృషీవలుల యభ్యున్నతికిఁ బాటుపడు వారల సమావేశము జరిగెను. కొందఱు కిసాను నాయకుల మనస్పర్థల వలన మదరాసు నందు సంఘటింపఁబడిన రైతు సంఘము డిసెంబరు 15న మీరటునందుఁ బునర్నిర్మాణము సేయఁబడెను. ఎట్టకేలకు 1936 ఏప్రియలునందు అఖిలభారత కిసాను మహాసభ లక్నోలో స్వామి సహజానంద గారి యధ్యక్షతను జరుపఁబడెను. ఆనాఁటి నుండయు ఆ కిసాను సంఘములు దినదినాభివృద్ధిని గాంచుచు నఖండ సేవ నొనరించుచున్నవి. ఈ సంఘమునకు వలసిన ధనము నంతయు మన రంగాయే చేకూర్చెను.

⋆ ⋆ ⋆

ఆ మహాశయుని సతీమణి శ్రీమతి భారతీ రంగా యాతఁ డొనర్చు ప్రతి ప్రజాహిత కార్యమునందును సహచారిణియై, పతిహితము నాచరించుచుఁ బ్రఖ్యాతివడసెను. భారత నాయకాగ్రణులలో సతీపతులు దేశ సేవయందుఁ దమ సర్వస్వమర్పించినవా రరుదు. ముఖ్యముగ మన యాంధ్రభూమిలో నట్టి మహా భాగ్యము మన రంగా దంపతులకే కలిగెను. వారి జీవితములు ధన్యములు. ఆమె

1925న ఇంగ్లండులో ఆక్సుఫర్డు విశ్వ విద్యాలయమునఁ జదివెను. 1931లో తెనాలిలో పికెటింగు చేసెను. 1932-33 సంవత్సరములలో సత్యాగ్రహోద్యమమునఁ బాల్గొని, యామె చాలామంది యువతుల నాసమరము నందు నడపెను. విదేశవస్త్రముల దుకాణములను, కల్లంగడులను 'పికెటింగు' చేసి యొక సంవత్సరము కారాగృహవాసమొసరించిన దా వనితామణి. ఆమె 1941 లో అఖిల భారత రైతు కాంగ్రెసు అధ్యక్షురాలుగ, 1942లో ప్రధాన కార్యదర్శిగ నుండెను. ఆంధ్రరైతు కాంగ్రెసుకు అధ్యక్షురాలుగ గొంతకాలముండెను. ఆమె స్వయముగ గోభూమియందు మాగాణి మెట్ట వ్యవసాయము చేయించు ఆదర్శ వనిత.

రంగా గారికి దేశమునందు రైతుజన బాంధవుఁడు కీరితి స్థిరపడియెను. 1937లో నాయకాగ్రణియగు జవ్హర్‌లాలాంధ్ర దేశ పర్యటనమున పొన్నూరు గ్రామమున రైతులను గూర్చి ముచ్చటించుచు "నా రాష్ట్రమందలి రైతుల యిక్కట్టుల నెఱుంగుదుగాన మీ సమస్యలను నేను గ్రహింప గలిగితిని. ఆచార్య రంగాగారిచేఁ బ్రారంభింపఁబడిన యుద్యమము ననుసరింపఁ బ్రయత్నించితినిగాన మీ సమస్యలను బాగుగాఁదెలిసి కొనఁగలుగుచున్నా" నని యుద్ఘాటించెను.

1931 నుండి నేఁటివఱకు రంగా కేంద్ర శాసనసభా సభ్యుఁడు, అఖిలభారత కాంగ్రెసు సంఘసభ్యుడు. మన దేశమున నూటికిఁ దొంబదిమంది రైతులుగాన కాంగ్రెసు కార్యక్రమమున రైతుద్ధరణ ప్రణాళికనుఁ జేర్పవలెనని యాతని యభిమతము. కాంగ్రెసే రైతు, రైతే కాంగ్రెసుగ నాతఁడు భావించును.

రంగా ఢిల్లీ శాసనసభయందలి 'కాంగ్రెసుపార్టీ' పక్షమున గొంతకాలమువర కార్థిక పరిశీలనాసంఘు (Statutory Committee) కార్యదర్శిగాఁ బనిచేసి దొరతనము వారి యార్థికనీతి రహస్యమును బయటబెట్టెను. ఇప్పుడు మరల కేంద్ర శాసనసభ యందలి కాంగ్రెసుపార్టీకి కార్యదర్శిగా నెన్నుకొనఁబడి తదున్నతి కెంతయుఁ గృషి యొనర్చుచున్నాడు. 1939 యుద్ధారంభమునుండి తీవ్రతరాందోళన చేయుచుండుటచే వారి సోదరులు శ్రీ లక్ష్మీనారాయణను 1940 మార్చి యందును,

రంగాను ఏప్రియలులోను ప్రభుత్వమువారు నిర్బంధించిరి. 1942 మార్చిలో వారు విడుదల చేయబడిరి. తిరిగి 1942 ఆగష్టు విప్లవ సందర్భమున వివిధ రాష్ట్రములందు గోప్యముగ విప్లవకార్యముల నడపించినపిమ్మట నా యాంధ్ర ప్రముఖుని "డెటిన్యూ"గ ప్రభుత్వమువారు నిర్బంధించి1944 లో విప్లవ తీవ్రత తగ్గినదని విశ్వసించినపిమ్మట ఆయన విడుదల చేయఁబడెను. అప్పటికప్పుడే గాంధీజీ విడుదలై సేవాగ్రామమున నుండెను. రంగా విడుదలైనదే తడవుగా సేవాగ్రామమున కరిగి గాంధీజీని సందర్శించెను. అప్పుడు వారిరువురు కాంగ్రెసు భావికార్యక్రమమునుగూర్చి విపులముగా మాట్లాడుకొనిరి. అది చరిత్రాత్మక మైనది. ఆనాడు మహాత్ముడు కర్షక, కార్మిక ప్రజారాజ్యమును సాధించుటకుఁ గాంగ్రెసు పూనుకొనునని రంగాద్వారా దేశమునకుఁ దెలియజేసెను. ఈ ఘటన, పట్టుదలతో, ధైర్య సాహసములతో శ్రామికుల రాజకీయములగు హక్కులకొఱకు రంగా వాదించుటను తెలుపును. మరియు మహాత్మునకు రంగాపై మిక్కిలి విశ్వాసము ప్రేమ గల వనుటను దెలుపును.

☆ ☆ ☆

రంగా, భారత స్వాతంత్ర్య సంపాదనకు విప్లవ మార్గముల తీవ్రతరముగ కృషి చేయవలయు నను సంకల్పము గలవాఁడు. అందుచే సుబాస్ చంద్రబోసుతో నాతనికి మైత్రి గలిగెను. త్రిపురీ కాంగ్రెసులో సుబాసుని జవహరలాలు ప్రతిఘటింప, కమ్యూనిస్టులు విడువ, కాంగ్రెసు, సోషలిస్టులు మధ్యవర్తులై యుండ, రంగా బోసు పక్షమున అతి ధైర్యముతో నిలబడెను. రంగా మహానాయకుల నందరిని ధిక్కరించి బ్రహ్మాండముగా నుపన్యసించెను. మరియు రాంఘరు కాంగ్రెసు సందర్భమున బోసుబా బేర్పరచిన "రాజీ ప్రతిఘటన సభ"కు తోడ్పడెను. నేతాజీ బోసుబాబు స్థాపించిన "ఫార్వర్డుబ్లాకు" నకు నామకరణ మొనర్చినది రంగాజీ.

☆ ☆ ☆

రంగా ప్రవేశము లేని రాజకీయరంగము లేదు. నవయుగ చైతన్యమునకు వలయు వివిధ రంగములం దాతఁడు చేరి యాయా సంస్థల పురోభివృద్ధికి

నపారమైన కృషి సల్పుచుండును. కాంగ్రెసు మహావృక్షపు పలు శాఖలయందుఁ జరించుచు నాయా శాఖా విలసనమున కత్యంత సంతోషము ననుభవించిన పికరాజ మా యాంధ్రనేత. కాంగ్రెసు విద్యుత్తును భిన్నభిన్న ప్రదేశములందు, భిన్నభిన్నము లైన యుపయోగముల కొఱకు వినియోగింపఁ జేసిన మేటి శాస్త్రజ్ఞుఁడాతఁడు.

విద్యార్థి, మహిళా, చేనేతకార్మిక, కాంగ్రెసు సంస్థల స్థాపించిన వాఁడు రంగా. వయోజన విద్యాసంఘమును నెలకొల్పెను. విద్యార్థి పౌరసత్వకళాశాలకు బీజములు నాటెను. మరియు నాతడు నూనె పదార్థముల ఉత్పత్తి సంఘమును బాదుకొల్పెను. పుగాకు సంఘమును సృష్టించెను. వ్యవసాయక కూలీ సంఘమును బ్రతిష్ఠించెను. ఈ విధముగా నాతడు పలు విధములైన సంఘముల యుత్పత్తికిఁ గారణభూత డయ్యెను. ఆతని శక్తి బహుముఖములైనది. వ్యవస్థాపనతో నాతని పని ముగియదు. తత్సంఘోద్ధరణమునకు, క్రమ వికాసమునకు నాతఁడు విసుకు విరామములు లేక యహర్నిశలు దేశమందెల్లడఁ గ్రుమ్మరుచుఁ బ్రచారము చేయుచుండును.

రంగా మేధాసంపద నిరుపమానమైనది. సభావేదికలపై గంటల తరబడి యుపన్యాసము లొసఁగుటయ గాక కార్యరంగమున దుమికి తన యాశయసిద్ధికి కృషి సల్పుటలో నాతఁ డందెవేసిన చెయ్యి. దేశనాయకు లింక పదివత్సరములకు నడుపనెంచు ప్రతి యుద్యమమును ముందుగ ప్రచారమొనర్చు నిశితదృష్టి యాతనిది. జమిందారీల విధానము గానిండు, హరిజనోద్ధరణ గానిండు. ఏదియైనను నాతఁడు మున్నే గ్రహించి దాని ప్రచారమును గావించుచుండును. అట్టి సునిశిత కుశాగ్రబుద్ధి, యనితర దుర్లభము.

రంగా జీవితాశయము కార్మికకర్షక సమ్మేళనము. దాని కొఱకై యాతఁడనుదినము జపించుచుండును. దాని కొఱకే కృషి చేయుచుండును. కిసాను కాంగ్రెసాతని సృష్టి. అఖిల భారత కిసాను కాంగ్రెసున కాతఁడధ్యక్షుఁడు. కూలీపై రైతాధారపడి యున్నాడు. ఆ రైతుపై కూలి ఆధారపడియున్నాడు. వారిరువురి సంబంధ మవినాభావము. వారిలో వారికి స్పర్థలు జనించెనా, లోకము పస్తుండవలసినదే. వారిద్దరి చేరిక చేతనే నవభారతవర్షము రత్నరాసులు

పండించగలదు. వా రిరువురి కలయికయే యువభారతమునకు సౌఖ్యాస్పదము. వారియైకమత్యమే భారతభూమికి సౌఖ్యాస్పదము. ఈ రహస్యము నెరింగియే శ్రీ గాంధి మహాత్ముని యహింసా సత్యముల ప్రచారామృతధారను రంగా ప్రజాహృదయ క్షేత్రములఁ బ్రవహింపఁజేసి స్వాతంత్ర్య సస్యబీజముల నాటుటకు సారవంతమొనర్చి కృతకృత్యుఁ డయ్యెను. ఇట్టి సర్వమానవ సౌభ్రాతృత్వము పునాదిగా గలిగిన స్వాతంత్ర్యమే సుస్థిరమై వెలయును.

రంగా తన మహదాశయమైన రైతు, కూలీ, బుద్ధిజీవి, పారిశ్రామికుల రాజ్య స్థాపనమును జాతీయ కాంగ్రెసుచేత నంగీకరింపఁజేసెను. గాంధి మహాత్ముని యాశీస్సుల నందెను. మహాత్ముడు, కాంగ్రెసు దీని నొప్పుకొనినంతమాత్రమునఁ జాలదని, రంగా గ్రహించెను. అతఁడు ప్రజాస్వామ్యవాది. ఈ యాశయము నెదిరించుచు కూలీ నియంతృత్వమే సాధనాయోగ్యమని ప్రచారము చేయు పక్ష మొకటి కలదు. అది 'తన పార్టీ' లను ప్రపంచమునందన్ని దేశములందును స్థాపించుకొని విరివిగా ప్రచారము సాగించుచున్నది. అట్టిది మన భారతభూమి యందును వెలసియున్నది. దాని ప్రచారము నెదుర్కొనవలసియున్నదని రంగా సూక్ష్మదృష్టిచే గ్రహించెను. వెంటనే యాతఁడు దానికిఁ బూనుకొని, కార్యరంగమున నడుము బిగించి దుమికినాఁడు. యూరపుఖండమున విజృంభించుచున్న కార్మిక నియంతృత్వమును ఆతఁ డెదిరింప దలఁచెను. రంగా 1946-47 లలో మూఁడుమారులు యూరపున కరిగెను. అచట జరుగుచున్న ప్రపంచ ప్రతినిధుల సభాముఖముల శ్రీ శాంతిదూత, మహాత్ముని విశ్వమానవకళ్యాణగీతా గానమునొనర్చి యాతడు మంత్రరుద్ధ భుజంగముల కైవడి విదేశీయుల నొనర్చెను. ప్రజారాజ్యాశయ ప్రాశస్త్యముల మృదుమధుర వచోఝరీ ధారా ప్రవాహముల వారిని ముంచి తేల్చెను. రంగా 'మార్క్సు' మహాశయుని సిద్ధాంతముల నీనాఁటి ప్రపంచ ప్రజారక్షణా స్పదముగ పునర్నిర్వచనము చేయవలసిన యావశ్యకతను నానాదేశములందలి 'సోషలిస్టు' ప్రముఖులచే నంగీకరింపఁజేసెను. ప్రపంచ ప్రజానీకమునకు 'మార్క్సు' సిద్ధాంతములవలన ప్రమాదము చేకూరకుండవలయుననిన మహాత్ముని యహింసా

సూత్రమునే యధారముగాఁ గొనవలెనని రంగా నొక్కి వక్కాణించెను. శ్రామిక జీవులెల్లరు సర్వతోముఖాభివృద్ధినొంది, సౌఖ్యప్రదముగ జీవింపవలయును. అందులకు సర్వశ్రామికులకు సమానమైన సంపూర్ణాధికారము లభ్యము కావలెనని రంగా యుద్బోధించెను. కార్మిక నియంతృత్వము పనికిరా దనెను.

రంగా హృదయ మెల్లప్పుడు పతితజనోద్ధరణకుఁ గడంగు చుండును. దేశమునందు నేఁడు సాంఘికముగ, నార్థికముగ వేనవేలు జనులు పతితు లయి, పలు బాధలకు గుఱి యగుచున్నారు. అట్టి దీనులఁగాంచినచో రంగా హృదయము పరితపించును. వారికై వాని యంతరాత్మ యాక్రోశించుచుండును. ఆతఁడు బాల్యమునుండియు హరిజనోద్ధరణకు నాతురతఁజెందుచుండెను. ఆనాటినుండియే పర్వతారణ్య ప్రాంతముల నాకు లలములఁ దినుచు సర్వవిధముల నధఃపతితులయి, యీనాఁటి నాగరికతా చిహ్నముల లేశమైనను నలవఱచుకొనక, విద్యాగంధ మిసుమంతయు నెఱుంగక యున్న కొండజాతుల వారి నుద్ధరింప రంగా సంకల్పించుకొనెను. ఆతఁ డాంగ్లదేశమున నున్న 1931వ, వత్సరముననే ప్రపంచమునందలి 'పతిత ప్రజారక్షణ సంఘము' నొకదానిని స్థాపించెను.

రంగాది యంతర్జాతీయ దృష్టి. ఆ దృష్టి సునిశితము. ఆతనిది ప్రంచ పంథా. భారతదేశమునందు మాత్రము సామ్రాజ్య వ్యతిరేక పోరాటము సాగించినఁ జాలదని యాతని యాశయము. ఈ సామ్రాజ్య పిశాచము ప్రపంచమునందన్ని దేశముల యందును విలయ తాండవ మాడుచుండుట నాతఁడు గ్రహించెను. అట్టి పిశాచమును మొదలనంటఁ దుడిచిపెట్టవలె నని యాతఁడు కృతనిశ్చయుఁ డయ్యెను. అందులకనియే రాజకీయార్థికాది రంగముల పతితులైయున్న సర్వప్రపంచ జనుల నేకముచేసి, వారియందు పరస్పర సహకారభావము రేకెత్తించి, స్వాతంత్ర్య పోరాటముల సాగింపవలెనని యాతని పరమ విశ్వాసము. అందులకే తనవలె నంతర్జాతీయ దృక్పథము గల జవహర్లాలు, సుబాసుబోసు మొదలగు నాయకులతో నాతఁడు హృదయపూర్వకముగా సహకరించెను.

రంగా, 1940 లో జైలునందున్నపుడు పతిత జనుల స్వాతంత్ర్య సంపాదనమును గుఱించిన సూత్రముల నిర్వహించుచు నొక గొప్ప గ్రంథము నాంగ్లమున రచించెను.

అయ్యది 1946 లోఁ బ్రకటింపఁబడినది, ఆ గ్రంథము నందలి కార్యవిధానమే నేఁడాఫ్రికా, అమెరికా దేశాల యందలి నీగ్రోలకు, తదితర ప్రజలకు మార్గదర్శక మగుచున్నది. రంగా పతిత జాతుల స్వాతంత్ర్య సంపాదనకై కృషిచేయు వారందఱఁ జేర్చి లండన్‌లో సంఘము నేర్పఱచెను. అద్దానికి సుప్రసిద్ధ సోషలిస్టు నాయకుడు ఫెన్నర్ బ్రాక్వే యధ్యక్షుఁడు. అందువలననే రంగా 1946-47లలో నాంగ్లభూమికేగిన తఱి, నీగ్రో జాతీయ నాయకులెందరో వానిని గురువుగను, నాత్మీయ బాంధవుని గను, సహృద్వరునిగను భావించి సేవించిరి. రంగా బోధనామృత పానకుతూ హలాయత్త చిత్తముల నత్తఱిఁ బెక్కు సభల నేర్పఱచిరి. ఇట్టి కొంగ్రొత్త సూత్ర నిర్వచనముల వలనను, వాని ప్రచారముల వలనను మహాత్మా, నెహ్రూల యభిమానపాత్రుఁడై రంగా భారత జాతీయ రంగస్థలమున వెలుంగు చున్నాడు.

⋆ ⋆ ⋆

ఎన్.జి.రంగా కార్మిక, కర్షక, పతితజన, ఆర్థికనీతి మున్నగు విషయములఁ గూర్చి యాంగ్లమునఁ బెక్కు గ్రంథముల రచించెను. అందు (Modern Indian Peisant) నేటిఁ భారత రైతు, (Labour in South India) దక్షిణ భారత కార్మికోద్యమము (Economics Organisation of Indian Villages Vol.I & II) భారత గ్రామీణ యార్థిక నిర్మాణము (World role of National Revolution) ప్రపంచ జాతీయ విప్లవములు ముఖ్యములు. తెనుఁగు బాసనుగూడ నాతఁడు హరిజన నాయకుఁడు, ఆధునిక రాజ్యాంగ సంస్థలు 'పాకిస్థాన్' మున్నగు గ్రంథములఁ బెక్కింటిని రచించెను. వాహిని, గోభూమి, చేనేత, ఆంధ్ర విద్యార్థి Rural Cottage Industries మున్నగు పత్రికల స్థాపనకు రంగా కారకుఁడు.

1945లో కేంద్రశాసనసభ కెన్నికలు వచ్చినవి. గుంటూరు, నెల్లూరు మండలములనుండి యభ్యర్థిని నియమింపవలసి యుండెను. అప్పుడు కాంగ్రెసునం దాత డేకైక ప్రతినిధిగా నియమింపఁబడెను. ఇంక నేమి పోటీలేకనే కేంద్ర శాసనసభా సభ్యుఁడుగా నెగ్గెను.

1942 లో భారతదేశమున బాధ్యతాయుతులగు ప్రజా నాయకులతో తాత్కాలిక ప్రభుత్వము కేంద్రమున నెలకొల్పcబడెను. రంగాగారికి వ్యవసాయ శాఖలోను, రైతాంగ వ్యవహారములలోను నున్న విజ్ఞానము, ననుభవము, దక్షతను గుర్తించి తాత్కాలిక ప్రభుత్వము వారిని 1946 మే నెలలో నంతర్జాతీయ వ్యవసాయక ఫలసాయదారుల సభ (International Agricultural Products Conference) కు భారత ప్రభుత్వ ప్రతినిధిగాc బంపిరి. అందుc దన పాత్రను బ్రశంసాపాత్రముగ నిర్వహించి రంగా భారతభూమికే వన్నె తెచ్చెను. ఆ లండను నగరములో నేర్పఱచcబడిన 'అఖిల ప్రపంచ రైతాంగ' పీఠమునుండి, కష్టజీవుల ప్రజారాజ్య సిద్ధాంతములను రంగా బ్రకటించెను. అచ్చట సంస్థాపింపcబడిన అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తిదారుల సంఘమునకు కార్యనిర్వాహక సభ్యుడుగా నెన్నుకొనcబడెను.

రంగా యాంధ్రనాయకుcడు. ఆతని నిష్కళంక నిరుపమాన సేవాభాగ్య మాంధ్రమాతకులభించుట ముదావహము. తన కొనర్చిన యుపకృతికి నాంధ్రమాత యతనిని అక్కునc జేర్చికొనినది. వాని శిలా విగ్రహములు గ్రామములందు బ్రతిష్ఠింపcబడినవి. ది. 26 10 45వ తేదీన గోవాడ గ్రామమున శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య గారిచే రంగాగారి శిలావిగ్రహము బహిర్గత మొనర్పబడినది. ఇంకను పలుతావుల శిలావిగ్రహములు స్థాపింపcబడినవి.

ఇట్లుండ 1947 మే 7వ తేదీన రెండవ ప్రపంచ వ్యవసాయోత్పత్తిదారుల మహాసభ హాలెండులో హేగ్ నగరమున జరిగెను. దానికి భారత ప్రభుత్వము కొందఱు సభ్యులను పంపెను. ఆ బృందమునకు నాయకుcడై ఆచార్య రంగా అచటి కేగి తన యశేష ప్రతిభా విశేషమును గనcబఱచి రైతు సమస్యల మేటియని ధ్రువపఱచెను. అచట నేర్పరుపcబడిన ప్రపంచ వ్యవసాయ మహాసభ కెన్నుకొనc బడిన నల్వురే. నల్వురు సభ్యులలో మన భారత ప్రతినిధి రంగా యొకcడై ప్రపంచ సంచార మొనర్చుచు లాస్కి మున్నగు వారితో నేcటి నమ్యలను జర్చించెను.

రంగా సేవను ఆకాంక్షించియే యాంధ్రప్రజ 1946 మే 16 న నాతcడు విదేశ సంచారమున నున్నతటి ఆతనిని రాష్ట్ర కాంగ్రెసున కధ్యక్షునిగా నెన్నుకొనెను. తన

రాష్ట్రీయుల పిలుపు నందుకొని స్వదేశమున కాగతుండై పూజ్యంబగు రాష్ట్ర కాంగ్రెసధ్యక్షతను స్వీకరించెను. ద్విగుణీకృతోత్సాహుండై, యహరహము, కాంగ్రెసును శాఖోప శాఖలుగా విజృంభింపజేసి తీవ్రప్రచారము గావించు చున్నాడు. చెన్నపురి యందు జరిగిన 19 వ రాష్ట్ర రాజకీయ మహాసభ సమయమున (సెప్టెంబరు 7,8) కాంగ్రెసు విజ్ఞాన పరిషత్తు, సాహిత్య దర్బారును జరిపి జాతీయ రచయితలను సత్కరించినది.

☆ ☆ ☆

శా॥ రే! దివ్యాంధ్రుడ! జాలమేల యదిగో రేగెన్ మహా విప్లవం
బా దివ్యాగ్ని మహోరు కీలలవె బ్రహ్మాండంబులన్ జుట్టుచున్
వాదేలా! యెవ్వరడ్డమైనను సరే స్వాతంత్ర్య మార్గంబునన్
బూదింజేయును శూరతన్ నిలుపుమా! పూర్ణార్థ స్వామ్యమ్ముకై.

ఆగస్టు 15, చరిత్ర ప్రసిద్ధమైనది. ఆనాడు మాతృ భూమి రాజకీయ స్వాతంత్ర్యము బొందినది. ఉత్సవములు జరుపుకొనినది. కాని దేశమున మతకలహములు హెచ్చి మానవులు దానవులై పరస్పర హత్యలకు, గృహ దహనములకు, శిశు, స్త్రీ వృద్ధ హత్యలకు తయారైనారు.

దేశమన ఆహారసమస్య విషమించినది. నైజాము దురంతములు మితిమీరినవి. క్షామము నుండి ప్రజలను రక్షించవలసి వచ్చెను. సంఘమునందలి దురాచారములను హెచ్చుతగ్గులను మట్టుపెట్టి సమానవకాశములను గలిగింప ఆర్థిక సమానత్వమునకై నిరంతర ప్రయత్న మవసరము. దేశమున 'ఏక్‌హో' ప్రజానినాదము ప్రతిధ్వనింప వలయును. హిందూ-ముస్లిము మిత్రత నాయకులలో మిత్రత అత్యంతావశ్యకములు.

మనము ఆంధ్రరాష్ట్ర సంపాదన కొఱకు 40 సంవత్సరములునుండి యవిశ్రాంత కృషి సలిపితిమి. మహాపండితులు ప్రజ్ఞాశాలురు దేశోద్ధారకులు నిరంతరము కృషిసలిపియు స్వరాష్ట్రమును సంపాదింపలేకపోయిరి. సింధు, ఉత్కళములు రాష్ట్రములను సాధించినవి. మనము భారత రాజకీయ స్వాతంత్ర్య సంసిద్ధి కొఱకై

రాష్ట్ర వాంఛను మరచితిమి. రాజకీయ స్వాతంత్ర్యము సిద్ధించినపిదప రాష్ట్ర సిద్ధికై త్వరపడక ఎట్లుండగలము? స్వయంపోషకత్వమున వైశాల్యమున జనాభాయందు వ్యాపార ఖనిజ సంపదలయందు మనము ఏ రాష్ట్రమునకుఁ దీసిపోము. ఆంధ్రప్రదేశ 1,10,250 చదరపు మైళ్ళ వైశాల్యముగల్గి దాదాపు $3^1/_2$ కోట్ల జనాభాతో రాణింపగలదు. విభజించి పాలించు సామ్రాజ్యవాదులు ఆంధ్రులను నైజాం, బస్తర్, బనగానపల్లి, మైసూరు సంస్థానముల క్రింద మద్రాసు ఒరిస్సా మధ్యరాష్ట్రముల రూపమున ఆంధ్ర ప్రదేశమును తారుమారుగా విభజించుటచే మిత్రతకు భంగము కలిగినది. రాయలసీమ, సర్కారులు, తెలంగాణా భాగములు గల విశాలాంధ్ర ప్రజారాజ్య నిర్మాణమునకై అందఱు ఐకమత్యముతో కృషిచేసిరి. రామపాదసాగర్, కృష్ణా, పెన్నా, దుడుమా, ప్రాజెక్టుల నిర్మాణములకు, ఆర్థిక స్వయంపోషకత్వమునకు పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రమవసరము, లేనిచో సంస్కృతి, విజ్ఞానము, ఆచారము, వ్యక్తిత్వము, గౌరవము తగ్గిపోవును. రాష్ట్ర సంపాదనకై దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు 1911లో విత్తనము వేసిరి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులై ప్రకాశం, పట్టాభి, రంగాగారలు తీవ్రముగా కృషిచేసిరి. తుదకు పొట్టి శ్రీరాములు యాత్మాహుతిచే, ఆంధ్రులు తీవ్రకృషిచే 1953 అక్టోబరు 1న రాష్ట్ర నిర్మాణమైనది. 1956 నవంబరు 1 కి తెలంగాణాతో కలసి ఆంధ్రప్రదేశ్ అవతరించినది. ఆంధ్రజాతి యొక్క సంపూర్ణాభ్యుదయమునకై ఆంధ్రనాయకులు తీవ్ర కృషి యొనర్చుచున్నారు.

రంగా కాంస్య విగ్రహము 1957 జూలై 12న విజయవాడయందు స్థాపితము.

భారతీ రంగా నేఁడు ఆంధ్రప్రదేశ ఎగువ శాసనసభ్యురాలు. రంగా జయంత్యుత్సవములు ప్రతి సంవత్సరము పలుచోట్ల జరుపబడుచున్నవి. రంగా కేంద్ర ప్రభుత్వమున "పబ్లిక్ అకౌంట్సు కమిటీ చెయిర్మను" గా నియమింపబడెను. భారతీ రంగా దంపతులు ధన్యులు.

☆ ☆ ☆

# రెండవ భాగము

1947 ఆగస్టు 15 వ తేదీ. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు. ఆసేతు హిమాచలం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ ఆనందించిన రోజు. స్వేచ్ఛా భారతావనిలో రైతుల కడగండ్లు తొలగిపోతాయని, కర్షకుల కళ్ళల్లో ఆనందాశ్రు వులు తొంగిచూస్తాయని రంగా కలలుగన్నారు. ఆనాటికి ఆచార్య రంగా అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుగా, ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర శాసనసభ సభ్యులుగా, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా, ఆర్థిక సంఘ సభ్యులుగా పదవులు నిర్వహిస్తున్నారు. నూతనంగా రచింపబడనున్న రాజ్యాంగంలో గ్రామ ప్రజలకు, గ్రామ పంచాయితీలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే గ్రామస్థాయి నుంచి దేశం ప్రగతిపథంలో పయనించగలదని ప్రగాఢంగా విశ్వసించారు రంగాగారు.

1948 నవంబరు 9వ తేదీన ముసాయిదా రాజ్యాంగం గురించి రంగాగారు ఉపన్యసించారు. ప్రజాస్వామ్యంలో గ్రామ ప్రజలు తమ బాధ్యతలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలంటే వారికి అవసరమైన రాజకీయ వ్యవస్థలను నెలకొల్పాలని రాజ్యాంగకర్తలకు సూచించారు. గ్రామ పంచాయితీల పునాదులు లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని, మహాత్మాగాంధీ ఆశించిన అధికార వికేంద్రీకరణ మాత్రమే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మగా నిలుస్తుందని తేల్చిచెప్పారు. కేంద్రీకృత విధానాలు పాటిస్తే అది నియంతృత్వానికి, అత్యయిక పరిస్థితికి, కమ్యూనిజం బలపడడానికి దారితీస్తుందని హెచ్చరించారు.

గ్రామ పరిస్థితులు గాని, రైతాంగం గురించి తెలిసిన వారుగాని రాజ్యాంగ నిర్మాణంలో పాలుపంచుకోవడంతో రంగాగారి సూచనలు అడవిగాచిన వెన్నెలయ్యాయి. రాజ్యాంగ నిర్మాణం తరువాత రాజ్యాంగ నిర్ణయ సభలో మాట్లాడుతూ రంగాగారు తన అభిప్రాయాలను నిష్కర్షగా, నిర్మొహమాటంగా తెలియచేశారు. రాజ్యాంగంలో, అధికార వికేంద్రీకరణ పట్ల తన అసమ్మతిని తెలియచేస్తూ "బలమైన కేంద్ర ప్రభుత్వానికి నేను వ్యతిరేకం కాదు. అయితే హిట్లరు వంటి నాయకుడు భవిష్యత్తులో కేంద్రంలో అధికారంలోకి వస్తే అధికార కేంద్రకరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసే ప్రమాదం ఉంటుంది. ఆ ప్రమాదం గురించి నేను మాట్లాడుతున్నాను. రాష్ట్రప్రభుత్వాలను రద్దుచేసే అధికారం కేంద్రానికి కట్టబెట్టడంలో ఔచిత్యం లేదు. ఇది దుర్వినియోగమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి" అని విశ్లేషించారు. ఆనాడు రంగా గారు ఊహించిన అత్యాయిక పరిస్థితి అనతి కాలంలోనే భారత ప్రజలు చవిచూడవలసి వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం ఎన్నోమార్లు జరిగాయి. వీటిని నివారించడానికి రంగా గారు చేసిన ప్రయత్నం విఫలమయినా, దీనిని బట్టి రంగా గారి "ముందుచూపు" ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

1948 లో శాన్‌ఫ్రాన్సిస్‌కో లో ప్రపంచ కార్మిక సదస్సు జరిగింది. భారతదేశపు ప్రతినిధిగా రంగా గారు ఆ సదస్సులో పాల్గొన్నారు. కార్మికుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సూచనలు ఆ సదస్సులో పాల్గొన్న వివిధ దేశపు ప్రతినిధుల ప్రశంసలకు పాత్రమయ్యాయి.

☆ ☆ ☆

కాంగ్రెస్ నాయకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నాయకులు చాలామంది కలత చెందారు. ప్రజాసంక్షేమం కోసం తాము చేస్తున్న సూచనలను బుట్టదాఖలు చేయడాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. కాంగ్రెస్‌కు రాజీనామా

చేయాలని తీర్మానించుకున్నారు. అలాంటి వాళ్ళలో ప్రముఖుడు జయప్రకాష్ నారాయణ. ఆయన 1948 లో కాంగ్రెస్‌ను విడిచిపెట్టారు. కాంగ్రెస్ నాయకుల్లో మార్పుకోసం మరికొంతకాలం వేచిచూసిన కొంతమంది నాయకులు, ఆశంచిన మార్పు కాంగ్రెస్ నాయకుల్లో కనపించకపోవడంతో విసుగు చెందారు. కాంగ్రెస్‌లో మార్పు అసాధ్యమని భావించి బయటకువచ్చారు. 1951 లో ఆవిధంగా కాంగ్రెస్‌ను వీడిన వారిలో ప్రముఖులు రంగా గారు, కృపలానీ గారు. రంగా గారు పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు.

తనలాగా కాంగ్రెస్‌ను విడిపోయి వచ్చిన వారందరినీ ఒకచోట చేర్చి భవిష్యత్కార్యాచరణకోసం కృపలానీ 1951 జూన్‌లో పాట్నాలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. కొత్త పార్టీని ఒకదానిని ఏర్పాటు చేయాలని కృపలానీ ఆలోచన. రంగా గారిని కూడా కృపలానీ ఆహ్వానించారు. ముందుగా ముఖ్యులతో జరిగిన సమావేశంలో కొత్తపార్టీ ఏర్పాటు చేయాలని, దానికి "మజ్దూర్ ప్రజా పార్టీ" అని నామకరణం చేయాలని కృపలానీ తెలియచేశారు. హాలికుల పట్ల అపారమైన అభిమానం ఉన్న రంగాగారు పార్టీ పేరుకు 'కిసాన్' పదం చేరిస్తే బాగుంటుందని సూచించారు. రంగా గారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ పార్టీకి "కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ" అని పార్టీ పేరును సవరించారు.

నాటి మధ్యాహ్నం కృపలానీ అధ్యక్షతన ఒక సభ జరిగింది. సుమారు ఐదువేల మంది ప్రజలు పాల్గొన్న ఆ సభలో కృపలానీ నూతన పార్టీ పేరును, ఆశయాలను ప్రకటించారు. అవన్నీ రంగా గారి అభిప్రాయాలకు దగ్గరగా ఉన్నవే. కృపలానీ మాట్లాడుతూ కాంగ్రెస్ సంస్థలోని బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, అధికార దుర్వినియోగం గురించి దుయ్యబట్టారు. కొత్తపార్టీ ప్రోగ్రాము నిర్ణయించడానికి ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారు. అందులో ఆంధ్రప్రాంతం నుంచి ప్రకాశం పంతులు గారికి చోటు కల్పించారు. కృపలానీ ఉపసంఘ సభ్యుల పేర్లను చదివేటప్పుడు "రంగా గారి పేరు చేర్చాలి" అంటూ సభికులు పెద్దగా అరిచారు. కార్య నిర్వాహక వర్గంలో రంగా గారికి చోటు కల్పిస్తామని కృపలానీ ప్రజలకు

తెలియచేశారు. కార్యదర్శి పేరు ప్రకటించే సమయంలో కూడా సభ్యులలో చాలామంది రంగా గారి పేరు సూచించారు. "రంగా గారు పెద్దవారు. వారికి ఇవ్వవలసినస్థానం తరువాత ఇస్తాము" అని కృపలానీ అప్పటికి ఆ విషయాన్ని దాటవేశారు. రంగా గారి పట్ల సభ్యులు ప్రదర్శించిన అభిమానం బహుశా కృపలానీ ప్రభృతులకు నచ్చకపోయి ఉండవచ్చు. అందుకే రంగా గారిని దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేశారని భావించవచ్చు.

☆ ☆ ☆

రంగా గారు కర్షకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రాంతంలో ఒక పార్టీని స్థాపించాలని నిర్ణయించుకున్నారు. తన అనుయాయులతో 1951 లోనే 'కృషికార్ లోక్‌పార్టీ' పేరుతో ఒక కొత్త పార్టీని ఏర్పాటుచేశారు. రంగా గారి అభిమానులు, రంగా గారి అభిప్రాయాలను గౌరవించేవారు, ఇష్టపడేవారు పార్టీలో చేరారు. పార్టీని బలోపేతం చేయడం కోసం రంగా గారు విశేషంగా శ్రమించారు. ఆంధ్రప్రాంతమంతా పర్యటించారు. 1952 లో ఎన్నికలు జరిగాయి. రంగా గారు గుంటూరు పార్లమెంటు స్థానానికి అభ్యర్థిగా నిలబడ్డారు. కానీ ఓటమి పాలయ్యారు. అదే సందర్భంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఎన్నికలు జరిగాయి. అప్పటికే ప్రత్యేకాంధ్ర ఉద్యమం ప్రారంభమయింది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రానికి నెహ్రూ వ్యతిరేకం కావడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. రంగా గారి కృషీకార్‌లోక్ పార్టీ తరపున నిలబడిన అభ్యర్థులు కొంతమంది విజయం సాధించారు. కమ్యూనిస్టులు ఎక్కువ స్థానాలు దక్కించుకున్నారు. కాంగ్రెస్, టంగుటూరి ప్రకాశం పంతులు గారి ప్రజాపార్టీ కూడా పలు స్థానాల్లో విజయం పొందారు. కానీ ప్రభుత్వం నెలకొల్పడానికి అవసరమైన మెజారిటీ ఏ పార్టీకి లభించలేదు. రెండు, మూడు పార్టీలు ఏకమై ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిన అగత్యం ఏర్పడింది.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు వ్యూహం పన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు తగిన మెజారిటీ లేకపోవడంతో, ప్రకాశం పంతులు గారిని ముఖ్యమంత్రిగా చేయాలని తలపెట్టారు. పదవీ వ్యామోహంలో ప్రకాశం

గారు వారి పన్నాగంలో పావు అయ్యారు. ఆ విషయం నెహ్రూ గారు గ్రహించారు. ఆంధ్ర, తమిళ ప్రాంతాలు కలిసి వున్న విశాల రాష్ట్రం కమ్యూనిస్టుల వశం కావడం నెహ్రూ గారికి ఇష్టం లేదు. కమ్యూనిస్టులకు రాష్ట్రాధికారం దక్కకుండా చేయడానికి ఆయన రాజాజీ గారిని ఉపయోగించుకోవాలనుకున్నాడు. అప్పటికి రాజాజీ రాష్ట్రానికి చెందిన ఏ సభలోనూ సభ్యుడుగా లేడు. ఆయన సభానాయకునిగా చేయాలని, తద్వారా కమ్యూనిస్టుల ఆటకట్టించాలని నెహ్రూ గారు ఆలోచన చేశారు.

నెహ్రూ గారు తన ఆలోచనను రాజాజాకి తెలియచేశాడు. "రంగాజీ సహకరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాను" అన్నారు రాజాజీ. "రంగాజీని మీరే ఒప్పించండి" అన్నారు నెహ్రూ గారు. రాజాజీ రంగా గారికి కబురు చేశారు. రంగా గారు మద్రాసు వెళ్ళి రాజాజీని కలుసుకున్నారు. విషయమంతా రాజాజీ రంగా గారికి తెలియచేశారు. "మీరు సహకరిస్తే నా ప్రయత్నం ఫలిస్తుంది" అన్నారు రాజాజీ. "రాజాజీ! ఈ రాష్ట్రం కమ్యూనిస్టుల హస్తగతం కాకుండా చేయడమే నాకు కావలసింది. మీ ప్రయత్నంలో మా కృషీకార్‌లోక్‌పార్టీ సంపూర్ణంగా సహకారం అందిస్తుంది" అంటూ రంగా గారు భరోసా ఇచ్చారు. "మీరు నా మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా చేరితే నాకు గౌరవంగా ఉంటుంది. రైతు సేవే ఊపిరిగా బ్రతికే మీకు మీ కార్యసాధనలో అధికారం అండగా నిలుస్తుంది" అన్నారు రాజాజీ. "క్షమించండి. నేను పదవులకోసం మీకు తోడ్పాటు అందించడం లేదు. కమ్యూనిస్టుల ఏకపక్ష కార్మిక నియంతృత్వాన్ని అడ్డుకోవడం కోసమే మీకు మద్దతునిస్తున్నా" అంటూ రాజాజీ ఇస్తానన్న ఉపముఖ్యమంత్రి పదవి తృణప్రాయంగా త్యజించారు. రాజాజీ కృషీకార్‌లోక్‌పార్టీ, ముస్లింలీగ్ తోడ్పాటుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆవిధంగా రంగా కమ్యూనిస్టుల ఆశలమీద నీళ్ళుచల్లారు.

☆ ☆ ☆

1952 లో గుంటూరు పార్లమెంట్ స్థానానికి నిలబడి ఓడిపోయినా అదే సంవత్సరం రాజ్యసభకు రంగా గారు ఎన్నికయ్యారు. ఆయన 1952 నుంచి

1956 వరకు రాజ్యసభ సభ్యుడుగా కొనసాగి అనేక విషయాలపై తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలియచేశారు. పార్లమెంటులో రైతుల వాణిని వినిపించారు. 1952 నుండి ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఊపందుకుంది. పొట్టి శ్రీరాములు గారు నిరసన దీక్షచేసి ఆత్మార్పణ చేసుకున్నారు. దానితో ఆంధ్రదేశం అట్టుడుకిపోయింది. తప్పని పరిస్థితుల్లో నెహ్రూ ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయడానికి నెహ్రూ గారు అంగీకరించారు. అనేక వివాదాలు, ఆందోళనలు, కుట్రలు, కుతంత్రాలు సాగి చివరకు కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రప్రాంతంలోని శాసన సభ్యులతో కొత్త శాసనసభ ఏర్పాటయింది. కాంగ్రెస్‌కు మెజారిటీ లేదు. ప్రకాశంపంతులు ఇతరులతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంతో ఏడాది తిరగకుండానే ప్రకాశం గారి ప్రభుత్వం పతనమయింది. గవర్నర్ నాయకత్వంలో రాష్ట్రపతిపాలన ఏర్పడింది.

1955 లో ఆంధ్రరాష్ట్రానికి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, రంగాగారి కృషీకార్‌లోక్ పార్టీ, ప్రకాశంపంతులు గారి ప్రజాపార్టీ “ఐక్య కాంగ్రెస్” గా ఏర్పడి శాసనసభకు పోటీ చేశారు. ఎన్నికల రణరంగంలో కమ్యూనిస్టులతో తలపడ్డారు. ఆ ఎన్నికలలో ఐక్య కాంగ్రెస్ విజయదుందుభి మ్రోగించింది. 196 సీట్లకు 147 సీట్లు దక్కాయి. బెజవాడ గోపాలరెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యారు. అధికారం అందుకోవడానికి అర్రులసాచిన కమ్యూనిస్టులను నిలువరించడంలో రంగా గారు సఫలమయ్యారు. 1955 లో రంగా గారు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

☆ ☆ ☆

1957 లో రెండవ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అప్పటికే కాంగ్రెస్‌లో చేరిన రంగా గారు తెనాలి నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. ఆంధ్రలో అధికారాన్ని అందుకోవడానికి తమను ఆమడ దూరంలో ఉంచిన రంగా గారిని గెలవనీయ కూడదని కమ్యూనిస్టులు భావించారు. రంగా గారికి వ్యతిరేకంగా తమ పార్టీ పక్షాన అభ్యర్థిని నిలబెట్టారు. అప్పటికే ‘సహకార వ్యవసాయం’ అనే విషయంలో

తమ అభిప్రాయాలకు విలువనివ్వని రంగా గారిమీద కాంగ్రెస్ గుర్రుగా ఉంది. రంగా గారు తెనాలిలో ఓటమి చెందితే బాగుంటుందని భావించింది. అందుకు అనుగుణంగా కాంగ్రెస్ పెద్దలు రహస్యంగా కమ్యూనిస్టు అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఆనాటి కాంగ్రెస్ అధినాయకులు గాని, కేంద్ర రాష్ట్ర మంత్రులు గాని, తెనాలి నియోజక వర్గంలో అడుగు పెట్టలేదు. ప్రచారం చేయలేదు. గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో పర్యటించి వెళ్ళారు. కాని ప్రజలు రంగా గారి పక్షాన నిలబడ్డారు. రైతుల హక్కులను, రైతుల ఆలోచనలను పార్లమెంటులో ప్రతిబింబించడానికి రంగా గారే తగిన వ్యక్తి అని భావించారు. 27 వేల ఓట్ల మెజారిటీతో రంగా గారిని గెలిపించారు. రంగా గారు పార్లమెంటులో రైతు ప్రతినిధిగా అడుగుపెట్టారు.

☆ ☆ ☆

ఆ రోజుల్లో నెహ్రూకు ప్రభుత్వ కార్యదర్శిగా 'మహాబలనీస్' అనే వ్యక్తి ఉండేవారు. ఆయన కమ్యూనిస్టు అభిమాని. ఆయన రష్యాలోని సమిష్టి సహకార వ్యవసాయం గురించి నెహ్రూ గారికి భూతద్దంలో చూపించి, అది భారతదేశంలో పాటిస్తే ఈ దేశం భూతల స్వర్గంగా మారిపోతుందని నూరిపోశాడు. నెహ్రూగారు రష్యా వెళ్ళారు. అక్కడి సమిష్టి సహకార క్షేత్రాలను దర్శించారు. ఆయనకు రష్యాలో వ్యవసాయం అత్యద్భుతంగా అనిపించింది. ఆ రష్యా పద్ధతిని భారతదేశంలో ప్రవేశపెట్టడం మంచిదని నిర్ణయించుకున్నారు. దానికి అనుగుణంగా పావులు కదపడం మొదలుపెట్టారు.

సమిష్టి సహకార వ్యవసాయం నిజంగా రైతులకు ప్రయోజనం కలిగించేదయితే రంగా గారు ఆమోదించేవారు. రష్యాలో అప్పటికే కమ్యూనిస్టు ప్రభుత్వం రైతలుకు వ్యతిరేకంగా తలపెట్టిన దుశ్చర్యలు రంగా గారి దృష్టికి వచ్చాయి. భూమిపై యాజమాన్య హక్కులను రైతుల నుంచి రష్యా ప్రభుత్వం తొలగించింది. భూమినంతా ప్రభుత్వం యాజమాన్యం క్రింద సాగుచేయవలసిందేనని నిర్ణయించింది. ఆవిధంగా, సాగుచేసే వ్యవసాయానికి 'సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు' అనిపేరు పెట్టింది. వ్యవసాయ క్షేత్రాలలో భూమి మీద హక్కు ఏ వ్యక్తికీ ఉండకూడదని ప్రభుత్వం

చట్టం చేసింది. రైతులకు ఓటుహక్కు లేకుండా చేసిన తర్వాత ఏర్పడే ప్రభుత్వానికి 'ఏకపక్ష కార్మిక నియంతృత్వ ప్రభుత్వం' అని పేరు పెట్టింది. ఆ విధంగా ఏర్పడిన వ్యవసాయ క్షేత్రాలలో ఆనాటి వరకు భూమికి హక్కుదారులుగా ఉన్న రైతులందరూ రోజువారీ కూలీలుగా మారిపోయారు. అంతటితో ఆగకుండా వారందరినీ కట్టుబానిసలుగా మార్చివేశారు. అనారోగ్యంతో పాలుమాలి పనికిరాని రైతులను తిరుగబాటుదారులుగా ముద్రవేసి, మూకుమ్మడిగా వేలకొలది రైతులను లారీలలో కుక్కి సైబీరియా అడవులకు తరలించి చిత్రవధలు చేసి చంపారు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న రంగా గారు సమిష్టి వ్యవసాయ విధానాన్ని నెహ్రూ అభివృద్ధిదాయకమైనదిగా, విప్లవాత్మకమైనదిగా అభివర్ణించడం సహించలేకపోయారు. నెహ్రూ ఆవడి కాంగ్రెస్ సదస్సులో సమిష్టి సహకార వ్యవసాయం అనే విధానాన్ని గురించి తీర్మానం చేయించారు.

రంగా గారితో యు.ఆర్.మసానీ గారు కూడా సహకార వ్యవసాయాన్ని నిరసిస్తూ పార్లమెంట్‌లో ఉపన్యసించారు. రంగా గారు ఆ సందర్భంగా పార్లమెంట్‌లో ఉపన్యసిస్తూ, భారత రైతులను ఇటువంటి ప్రమాదకరమైన పద్ధతులలోనికి నెట్టవద్దని, రైతుల ఓట్లతో గెలిచిన నెహ్రూ గారు రైతులకు అన్యాయం చేయడం తప్పని హెచ్చరించారు. "మన దేశంలోని రైతులు స్వతంత్రులు. స్వేచ్ఛా జీవులు. గాంధీ గారి ఆశయాలపై నమ్మకం కలిగినవారు. హింసమీద నమ్మకం లేనివారు. ప్రభుత్వ పెత్తనాన్ని, అధికారుల లంచగొండితనాన్ని సహకార వ్యవసాయం పేరిట రైతులపై రుద్దడం అన్యాయం" అంటూ రంగా గారు తన నిరసనను తెలియజేశారు. పార్లమెంటు సభ్యులలో చాలామంది రంగా గారి వాదనను బలపరిచారు. దీనితో నెహ్రూ గారు పరోక్ష పద్ధతులతో తన పంతం నెగ్గించుకోవాలని భావించారు. నెహ్రూగారు రంగా గారికి కబురు చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖకు మంత్రిగా ఉండవలసిందిగాను, తనకు సహకారం అందించవలసిందిగాను కోరారు. రంగా గారు తనకు మంత్రి పదవి వద్దని, సహకార వ్యవసాయమనే ఆలోచనను విరమిస్తే సంతోషిస్తానని తెలియచేశారు.

☆ ☆ ☆

అదే సమయంలో వినోభాభావే "సర్వోదయ" అనే పేరుతో రైతుల నుండి ఐచ్ఛికంగా భూమినా దానంగా స్వీకరించాలని ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమానికి జయప్రకాశ్ నారాయణ కూడా మద్దతు ఇచ్చారు. దేశవ్యాప్తంగా, ఈ ఉద్యమం గురించి ప్రచారం ప్రారంభమయింది. నెహ్రూ గారు 'సర్వోదయ' ఉద్యమాన్ని తన సహకార వ్యవసాయ విధానానికి ఉపయోగించుకోవాలనుకున్నారు. వందలాది సర్వోదయ కార్యకర్తలతో పాదయాత్ర చేస్తున్న వినోభాభావే, జయప్రకాష్ నారాయణలతో కలవాలని భావించారు. పాదయాత్ర ఎల్వాల్ చేరే సమయానికి నెహ్రూ గారు ఎల్వాల్‌లో వారితో కలిశారు. వినోభాభావే గాంధీజీకి ఇష్టమైన వ్యక్తి. ఆయన ప్రారంభించిన 'సర్వోదయ' ఉద్యమం ద్వారా సమిష్టి సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెడితే రంగా గారు కూడా గాంధీజీ మీద అభిమానంతో మౌనంగా ఉంటారని నెహ్రూ గారు తలపోశారు. అంటే 'సర్వోదయ' ముగుసులో రైతులను ముంచడానికి నెహ్రూ గారు సిద్ధమయ్యారు.

'ఏల్వాల్' సభలో వినోభాభావే, జయప్రకాశ్ నారాయణ, జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాల సారాశం ఇది. "ఆకాశం, నీరు, నిప్పు, వాయువు, భూమి అనేవి పంచభూతాలు. ఇవి అందరిసొత్తు. భూమి తప్ప మిగిలిన నాలుగు అంటే ఆకాశం, నీరు, నిప్పు, వాయువు ఎవరి నియంత్రణలోను ఉండడం లేదు. మానవులతో పాటు సర్వజీవకోటి స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. అలాంటప్పుడు భూమికి మాత్రం మినహాయింపు ఎందుకు ఉండాలి? ఉండకూడదు. భూమి కూడా మిగిలిన వానిలాగే అందరికీ చెందాలి. యాజమాన్యపు హక్కు తొలగిపోవాలి. అంటే భూమిమీద హక్కు ప్రభుత్వానికి తప్ప ప్రజలకు ఉండకూడదు.

నెహ్రూ గారి దురాలోచనను రంగా గారు పసిగట్టారు. అక్టోబరు 9 వ తేదీన కృష్ణాజిల్లా కిసాన్ సభలను ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో హాజరయిన రైతుల నుద్దేశించి ప్రసంగిస్తూ రైతులు సమాజానికి చేస్తున్న సేవను ప్రశంసించారు. సహకార వ్యవసాయ విధానం రైతాంగ ఆర్థిక వ్యవస్థను ఎలా విచ్ఛిన్నం చేస్తుందో వివరించారు. ప్రభుత్వ విధానాలు రైతులకు ఏ విధంగా నష్టం కలిగిస్తాయో

తెలియచేశారు. రైతులకు రక్షణ, సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని గుర్తు చేశారు. సహకార వ్యవసాయాన్ని ఎదిరించడానికి రైతులు వెన్ను చూపరని హెచ్చరించారు.

"ప్రపంచంలో కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మూలం భారత దేశమయితే, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలం వ్యవసాయదారుడు. రైతు కాయకష్టం చేస్తాడు. పొలం దున్నుతాడు. సేద్యం చేస్తాడు. ఉత్పత్తి చేస్తాడు. స్వతంత్రంగా బ్రతకడానికి ఏ వర్గానికి చెందిన శ్రమ జీవులనూ దోపిడీ చేయడు. చేయాలని ఆలోచించడు. రైతు ఆత్మాభిమానం కలవాడు. ఎవరికింద పనిచేయడు. రైతులతోపాటు కోట్లాది చేతివృత్తులు శ్రామికులు కూడా ఇదే తరగతికి చెంది ఉంటారు.

దేశానికి అవసరమైనప్పుడు అధికోత్పత్తి చేసి ఈ ఆర్థికవ్యవస్థ నిలబెట్టేది రైతే. స్వల్పమైన ప్రభుత్వ సహాయంతోనే పోరంబోకు పొలాలను సాగుచేసి పండిస్తాడు. జాతి సంస్కృతిని భాషలను కాపాడుతాడు.

ఇలాంటి వ్యవస్థను ప్రభుత్వం కాపాడుకోవాలి. వ్యవసాయ పరికరాలు, సాంకేతిక వస్తువులు, ఎరువులు, గిడ్డంగులు మొదలయిన సౌకర్యాలను రైతులకు కల్పించి, రైతు ఇతోధికంగా ఉత్పత్తిని సాధించడానికి తోడ్పడాలి. అంతేగాని రైతాంగ వ్యవస్థను హతమార్చి, రైతుల జీవితాన్ని సహకార వ్యవసాయంలో ఇరికించి, ఆ సహకార వ్యవస్థ కింద బానిసలుగా మార్చకూడదు. కాని స్వేచ్ఛా స్వాతంత్రాలను, ఆర్థిక హక్కులను హరించకూడదు.

భూమి గ్రామానికంతటికీ సమిష్టి ఆస్తి అనీ, సహకార కమతాల ద్వారా ఉత్పత్తి సాగాలని సర్వోదయ ఉద్యమం సాగిస్తున్నారు. ఈ విధమైన సహకార వ్యవసాయాన్ని పాటించిన దేశాలన్నీ తమ అభిప్రాయాలు తప్పని తెలుసుకున్నాయి. చిన్న కమతాలు గిట్టుబాటుగా ఉంటాయని, సగటు ఉత్పత్తి పెరుగుతుందని, రైతుకు ఆర్థిక స్వయం పోషకత్వం, సాంఘిక భద్రత కలుగుతుందని నేను నమ్ముతున్నాను. కోట్లాది స్వేచ్ఛా జీవుల ప్రతిపత్తిని హరించి వారిని బానిసలుగా చేసే ప్రయత్నాన్ని గర్హిస్తున్నాను. ఇదంతా వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి, స్వేచ్ఛను హరించడానికి, స్వతంత్ర

జీవనోపాధిని వమ్ము చేయడానికి పన్నిన రాజకీయ కుట్ర. రైతుల శ్రమను, పెట్టుబడిని దోచుకోవడానికి చేస్తున్న కుట్ర.

సమిష్టి సహకార వ్యవసాయమనే పేరుతో ప్రభుత్వం చేసే మోసాన్ని నిలువరించడానికి, వ్యవస్థను నిలుపుకోవడానికి మనం త్యాగాలకు సిద్ధం కావాలి. మనలను ఎవ్వరూ మోసగించలేరు. మన హక్కులను హరించలేరు. రైతాంగ వ్యవస్థ తిరుగులేనిది. ఎదురు లేనిది. నేను ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నా. మాకుటుంబ ఆర్థిక వ్యవస్థ జోలికి రావద్దు. దాన్ని విచ్ఛిన్నం చేయవద్దు. ఉత్పత్తి కార్యక్రమాల్లో మమ్మల్ని ఆదుకోండి. మీరు అడిగినదానికంటే హెచ్చు ఉత్పత్తిని చూపెడతాము. జాతీయ అవసరాలను తక్కువ వ్యయంతో తీరుస్తాం.

అధిక ఆదాయం వచ్చే మార్గాలను వదిలిపెట్టి రైతుల జోలికొస్తే సహించేది లేదు. ఈ వ్యవస్థ నాశనమయితే గ్రామాల్లోని జనమంతా బస్తీలకు ఎగబడతారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలి. నష్టాలకు భీమా, శ్రమకు విలువ, వృత్తికి గౌరవం, లాభ నష్టాలు లేని ప్రజా కార్యక్రమంగా వ్యవసాయాన్ని రూపొందించడం, గ్రామ ప్రజలకు పట్టణ ప్రజలకు మధ్య జీవన ప్రమాణంలో వ్యత్యాసం తగ్గించడం, నాగరిక ప్రపంచంలో జీవించగలిగే విధంగా రైతు జీవన స్థాయిని పెంచడం – ప్రభుత్వం చేయవలసిన పనులు అని గుర్తుచేస్తున్నారు.

ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా సమిష్టి సహకార వ్యవసాయాన్ని మా మీద రుద్దితే జనాభాలో సగానికిపైగా ఉన్న రైతులు, చేతివృత్తులవారు చైతన్యంతో ముందుకు వస్తారు. ప్రభుత్వాన్ని ఎదిరిస్తారు. కూకటివ్రేళ్ళతో వ్యతిరేక శక్తులను కూలుస్తారు".

కృష్ణాజిల్లాతో పాటు అనేక ప్రదేశాల్లో రంగా గారు సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తూ ఇదే విధమైన ఉపన్యాసాలు చేశారు. ఆనాటి వార్తాపత్రికలు రంగా గారి అభిప్రాయాలను ప్రముఖంగా ప్రచురించాయి. వెంటనే వినోభాభావే మాటమారుస్తూ తనది రైతులను ఒత్తిడిచేసే ఉద్యమం కాదని ప్రకటించారు. నెహ్రూ గారితోపాటు పంత్ రాధాకృష్ణన్ మొదలైనవారు గ్రామదాన్ రైతులకు

వ్యతిరేకం కాదంటూ రంగా గారికి లేఖలు వ్రాశారు. 1957 లో బల్గేరియాలో జరిగిన సహకార కాంగ్రెస్‌కు భారతదేశపు ప్రతినిధిగా రంగా గారు, హాజరయ్యారు.

రంగా గారిని మచ్చిక చేసుకోవాలనే ఆలోచన నెహ్రూ గారిలో మారలేదు. 1958 మే లో రంగా గారిని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సెక్రటరీగా ఎన్నుకున్నది. ఆ సందర్భంగా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నెహ్రూ గారు ప్రసంగిస్తూ "రంగా గారు ఇక మాకు సహాయం చేస్తారు" అని అన్నారు. ఆ సాయం ఏమిటో రంగా గారికి తెలుసు. రంగా గారు తన పదవి కోసం రైతుల ప్రయోజనాన్ని పణంగా పెట్టకూడదని అనుకున్నారు. రంగా గారు సెక్రటరీగా ఉన్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ విషయాల్లో నెహ్రూ గారికి సముచితమైన సలహాలను ఇచ్చేవారు.

నెహ్రూ గారు సమిష్టి సహకార వ్యవసాయం గురించి ఆలోచన విరమించలేదు. 11-1-1959 లో నాగపూర్‌లో కాంగ్రెస్ సదస్సు జరిగింది. ఆ సదస్సు కో ఆపరేటివ్ విధానానికి అనుకూలంగా తీర్మానం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ 1959, జనవరి 19 వ తేదీన రంగా గారు తన అసమ్మతిని తెలియజేశారు. మార్చి నెలలో తన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. జూన్‌లో కాంగ్రెస్ పార్టీలో తన సభ్యత్వానికి కూడా రాజీనామా సమర్పించారు.

☆ ☆ ☆

రంగా గారు రాజీనామా చేస్తారని నెహ్రూ గారు ఊహించలేదు. మసానీ, మున్షీ మొదలైన నాయకులు రంగా గారి అభిప్రాయాన్ని బలపరచడం నెహ్రూ గారికి నచ్చలేదు. ఆయన పార్లమెంటులో మాట్లాడుతూ "రంగా గారు చాలా పార్టీలు మార్చారు" అని విషయాన్ని సమర్థించుకోలేక వ్యక్తిగత విమర్శకు పూనుకున్నారు. వెంటనే రంగా గారు "పార్టీ మారినా గెలువగలననే ధైర్యం నాకుంది. నా గౌరవనీయ మిత్రుడు జవహర్‌లాల్ గారికి ఆ దమ్ము, ధైర్యం లేవు" అని ప్రత్యుత్తరమిచ్చారు. నెహ్రూ గారు ఆ దెబ్బకు మౌనాన్ని ఆశ్రయించారు.

తాను రాజీనామా చేసినంత మాత్రాన నెహ్రూ గారు సమిష్టి సహకార వ్యవసాయ విధానాన్ని ఉపసంహరించుకోరని రంగా గారికి తెలుసు. రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలంటే ఏమి చేయాలా అని ఆయన ఆలోచిస్తున్నారు. అందుకు ప్రాతిపదికగా రంగా గారి సూచనపై రాజాజీ బెంగుళూరులో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సర్దార్ లావసింగ్, జనరాజ్ హెగ్డే మరికొందరు ప్రముఖులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. రాజాజీ సభాధ్యక్షులు. బెజవాడ రామచంద్రా రెడ్డిగారు పరిచయ వాక్యాలు పలుకుతూ కాంగ్రెస్ వారి కమ్యూనిస్టు ధోరణిని, నాగపూర్ తీర్మానాన్ని తీవ్రంగా విమర్శించి, రైతు రక్షణ విధానాలను విడమరచి చెప్పారు.

రాజాజీ గారు మాట్లాడుతూ కొత్త పార్టీని జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని అంటూ, ప్రభుత్వం పెత్తందారీతనాన్ని, ప్లానింగ్ కమీషన్ యొక్క రాజ్యాంగేతర విధానాలను, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ప్రభుత్వం చేస్తున్న దాడులను విమర్శించారు. కొత్తగా ఏర్పాటుచేయబోయే పార్టీకి నాయకునిగా రాజాజీ ఉంటే బాగుంటుందని రంగా గారు ప్రతిపాదించారు. తాను "నాయకుని నడిపించే నాయకుడు" గా ఉంటానని, ఆ భారాన్ని రంగా గారే మోస్తారని రాజాజీ తెలియచేశారు.

"కొత్త పార్టీకి ఏ పేరు పెట్టాలి? అని సభికులు ప్రశ్నిస్తే "సాయంత్రం వివేకానంద హాలులో బహిరంగ సభ జరుగుతుంది. ఆ సభకు మసానీ గారు వస్తారు. ఆ సభలో పార్టీ పేరును నిర్ణయిద్దాము" అని రంగా గారు బదులు చెప్పారు. సాయంత్రం జరిగిన సభలో రాజాజీ కొత్త పార్టీకి "స్వతంత్ర పార్టీ" అని నామకరణం చేశారు. ఈ సభ తరువాత రాజాజీ "వ్యవసాయాన్ని, కుటుంబాన్ని రక్షించుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఆ నినాదమే స్వతంత్ర పార్టీకి ముఖ్య కార్యక్రమమయింది.

కొద్ది రోజుల తరువాత రాజాజీ మద్రాసులో సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో స్వతంత్ర పార్టీకి అధ్యక్షులుగా ఉండవలసిందిగా రాజాజీ కోరడంతో రంగాగారు స్వతంత్ర పార్టీ పగ్గాలు చేపట్టారు. రంగా గారు అధ్యక్షులైన విషయం అన్ని పత్రికలలో, రేడియోలలో ప్రముఖంగా వచ్చింది. రాజాజీ మీద అభిమానం కలవారు,

రంగా గారి అభిప్రాయాలు నచ్చినవారు, కాంగ్రెస్ అస్తవ్యస్త విధానాలను నిరసించేవారు స్వతంత్ర పార్టీలో చేరసాగారు. స్వతంత్ర పార్టీ వ్యవసాయదారల పార్టీ అని, స్వతంత్ర వృత్తులు చేసుకొనేవారి పార్టీఅని, స్వేచ్ఛను ప్రేమించేవారి పార్టీ అని నమ్మి చిన్ని చిన్న వ్యాపారస్తులు, రైతులు, వివిధ వృత్తులువారు స్వతంత్ర పార్టీలో సభ్యులయ్యారు. పత్రికలు రాజాజీ, రంగాజీ ఉపన్యాసాల గురించి, స్వతంత్ర పార్టీ గురించి చక్కగా స్పందించాయి. ఇది నెహ్రూ గారి కోపానికి కారణమయింది. నెహ్రూ గారు మర్యాద, మన్నన పాటించకుండా "స్వతంత్ర పార్టీ మహరాజుల పార్టీ. ఇతరుల లాభాలపై ఆధారపడేది, మార్పుకు ఇష్టపడని పార్టీ" అని ఆరోపణలు చేశారు.

నెహ్రూ గారి ఆరోపణలకు సమాధానమిస్తూ రంగా గారు "స్వతంత్ర పార్టీకి రంగా అధ్యక్షుడు. ఆయన ఇన్నేళ్ళుగా రైతులకోసం కష్టపడుతున్న విషయం నెహ్రూ గారు మరచిపోయారా?" అని ప్రశ్నించారు.

1959 లో సబర్మతీ ఆశ్రమం వద్ద స్వతంత్ర పార్టీ లాంఛనంగా ప్రారంభమయింది. ఆగస్టు 1వ తేదీన అధికారికంగా రంగా గారు అధ్యక్షులయ్యారు. అప్పటి నుండి ఒక ప్రక్క పార్టీ బలోపేతానికి దేశమంతా పర్యటిస్తూనే, మరోప్రక్క పార్లమెంటు సభ్యునిగా నెహ్రూగారి ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించసాగారు.

1962 లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు ధీటుగా నిలబడడానికి రంగా గారు విశేషంగా శ్రమించారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి స్వతంత్ర పార్టీ సిద్ధాంతాలను చెప్పడంతోపాటు నెహ్రూ రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. 1962లో ఎన్నికలొచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నుండే గాక గుజరాత్, కర్ణాటక మొదలైన రాష్ట్రాలలో కూడా స్వతంత్ర పార్టీ అభ్యర్థులు పోటీ చేశారు. ఆ ఎన్నికలలో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా రంగా గారు తెనాలి నుంచి పోటీ చేశారు, కానీ పరాజయం పాలయ్యారు.

రంగా గారు పార్లమెంటులో లేకపోతే రైతాంగానికి కలిగే నష్టం తెలిసినవారు కావడంతో అనతికాలంలో చిత్తూరుకు జరిగిన ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అతిరథ

మహారథులు ప్రచారం చేసినా రంగా గారే విజయం సాధించి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పార్లమెంటులో అడుగుపెట్టారు.

☆ ☆ ☆

నెహ్రూ గారు మాత్రం సమిష్టి సహకార వ్యవసాయాన్ని చట్టం చేయాలనే ఆలోచనను విరమించుకోలేదు. రంగా గారు కూడా దేశవ్యాప్తంగా సమిష్టి సహకార వ్యవసాయం వలన కలిగే నష్టాలను గురించి ప్రజలకు వివరించడం కూడా విరమించుకోలేదు. అనేకచోట్ల సభలు, సమావేశాలు నిర్వహించారు. అవసరమయితే గాంధీజీ బాటలో సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనం చేయడానికి నడుం బిగించారు.

అది 1963 వ సంవత్సరం మే నెల 6 వ తేదీ. పార్లమెంటు ప్రొసీడింగ్స్ కవరును తెరిచారు రంగా గారు. అందులో 17వ రాజ్యాంగ సవరణ బిల్లును చూచి ఆశ్చర్యపోయారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహోన్నత త్యాగాలు చేసిన రైతులను కుట్రతో, మోసంతో దగా చేయడానికి నెహ్రూ గారు పూనుకోవడం రంగా గారికి బాధ కలిగించింది. నిశితంగా బిల్లును పరిశీలించి నోట్సు తయారు చేసుకున్నారు. పార్లమెంటుకు వెళ్ళారు. బిల్లును ప్రవేశపెట్టే సమయంలోనే దాన్ని ప్రతిఘటించారు. "పండిట్ జీ! మీరు రైతలకు ఇంతటి అన్యాయం చేయడం భావ్యమా? పార్లమెంటు మెంబర్ల కన్నుగప్పి, మైమరపించి, పార్లమెంటు చివరి రోజున ఇంతటి హడావుడిగా బిల్లు ప్రవేశపెట్టాలా? ఇది మీ హుందాతనానికి తగిన పనేనా? ఇప్పటికైనా ఈ బిల్లును విరమించండి" అంటూ ప్రాధేయపడ్డారు. ఆనాటికి సభ వాయిదా పడింది.

అప్పటికి లోక్‌సభలో కాంగ్రెస్‌కు 2/3 వంతుల మెజారిటీ ఉంది. స్వతంత్ర పార్టీకి సుమారు 50 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. స్వల్ప సంఖ్య కలిగిన పార్టీ నాయకునిగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన సవరణను ఓడించడం అసాధ్యమని అందరూ అనుకున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా పార్లమెంట్ సభ్యులందరినీ కలిశారు. సుదీర్ఘంగా సంభాషించారు. రైతలకు జరిగే అన్యాయం

గురించి వివరించారు. ఆ సవరణే ఆమోదింపబడితే రైతు అనేవాడు ఉండడని, అందరూ కూలీలుగా మారిపోతారని తెలియజెప్పాడు. రష్యాలోని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో రైతులు ఎలా బానిసలయ్యారో ఉదాహరణలతో నిరూపించారు. రంగా గారి అభిప్రాయాలతో పెక్కుమంది సభ్యులు ఏకీభవించారు.

17 వ రాజ్యాంగ సవరణపై లోక్‌సభలో చర్చ జరిగింది. రంగా గారు దాని వలన కలిగే కష్ట నష్టాలను తెలియచేశారు. అలాంటి సవరణను ఆమోదిస్తే అది కాలసర్పమై రైతులను కాటువేస్తుందని హితవు చెప్పారు. ఓటింగ్ జరుగబోతుండగా వాయిస్ ఓటుతో కాక డివిజన్‌తో ఓట్లు లెక్కించాలని (ప్రతి సభ్యుని తలలు లెక్కించే పద్ధతి) రంగా గారు పట్టుబట్టారు. ఢిల్లీలో ఉండి కూడా సభ్యులు చాలా మంది ఆరోజు పార్లమెంటుకు రాకపోవడం, సభకు హాజరయిన సభ్యులలో కూడా కొందరు ఓటింగ్ సమయానికి బయటకు వెళ్ళడంతో సభలో తక్కువమంది సభ్యులే మిగిలారు. ఓట్లను లెక్కిస్తే సవరణ వీగిపోయింది. నెహ్రూ గారి ముఖంలో రంగులు మారాయి. ఆయనకు నోట మాట రాలేదు. రెండొంతుల మెజారిటీ తన పార్టీకి ఉండి కూడా బిల్లును గెలిపించుకోలేక పోయాననే బాధ ఆయనలో కోపాన్ని రగిలించింది. ఆయన ఆ కోపంతో పార్లమెంట్ భవనం లోని తన కార్యాలయానికి వెళ్ళారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సెక్రటరీని, పార్టీ విప్‌లను హుటాహుటిన పిలిపించారు. లోపల ఆయన ఏమని ప్రశ్నించారో, వారేమి సమాధానం చెప్పారో, ఏమని ఆయన ఆదేశించారో తెలియదు. కాని మరునాడు తొమ్మిది గంటలకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయబడింది.

సమావేశానికి వచ్చిన నెహ్రూ ముఖంలో ఇంకా కోపం తాండవిస్తూనే ఉంది. ఆయన తన ఆసనంలో కూర్చోలేదు. ఎప్పటిలాగా 'ఫ్రెండ్స్' అని సంబోధించలేదు. గద్గద స్వరంతో "పార్టీకి నాయకుడెవరు? నేనా? రంగాజీనా?" అని ప్రశ్నించాడు. ఎవ్వరూ మాట్లాడదేదు. మళ్ళీ మళ్ళీ ఉచ్ఛస్వరంతో రెట్టించి అడిగాడు. సభ్యులు భయపడిపోయారు. "మీరే, మీరే మా నాయకులు" తేరుకున్న తరువాత సభ్యులు సమాధానమిచ్చారు. "అయితే నా సభలో సవరణ ఎందుకు వీగిపోయింది?"

అని గద్దించి అడిగారు నెహ్రూ గారు. సభ్యులు మౌనాన్ని ఆశ్రయించారు. మళ్ళీ మరొకసారి నియమావళిననుసరించి రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టాలని చివరికి తీర్మానం చేసింది కాంగ్రెస్ పార్లమెటరీ పార్టీ.

ఆతరువాత నెహ్రూ గారికి కష్టాలు ఆరంభమయ్యాయి. ఆయన ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు పటాపంచలయ్యాయి. భారతదేశంపై చైనా దండెత్తి కొంత భూభాగాన్ని ఆక్రమించుకొంది. పార్టీపై పట్టు సడలింది. ఒకప్పుడు మకుటం లేని మహారాజుగా అధికారం చెలాయించిన నెహ్రూపై విమర్శల దాడి పెరిగిది. నెహ్రూ విధానాలు ప్రగతి సూచికలు కాదని ప్రపంచం కోడై కూసింది. పూలమ్మిన చోటే కట్టెలమ్ముకోవలసి రావడాన్ని నెహ్రూ తట్టుకోలేక పోయారు. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించింది.

1964 సంవత్సరం మొదట్లో నెహ్రూ కోరిక నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ 17 వ రాజ్యాంగ సవరణను ఆమోదించింది. కమ్యూనిస్టులు మినహా మిగిలిన సభ్యులెవరూ దానికి అనుగుణంగా స్పందించలేదు. ఇది జరిగిన కొద్ది కాలానికే ఒరిస్సా పర్యటనకు వెళ్ళిన నెహ్రూ గారు అనారోగ్యానికి గురయ్యారు. ఢిల్లీకి తిరిగివచ్చి కొద్ది రోజుల్లోనే అంటే 1964 మే 27 వ తేదీన కన్నుమూశారు.

నెహ్రూకి వారసునిగా లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని అయ్యారు. ఆయన 17వ రాజ్యాంగ సవరణను పట్టించుకోలేదు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే పాకిస్థాన్ భారతదేశంపై యుద్ధం ప్రకటించింది. లాల్‌బహదూర్ యుద్ధ సమయంలో దేశమంతా సమైక్యంగా ఉండాలంటూ ప్రజలకు ప్రబోధించారు. జనమంతా కుల, మత, జాతి, వర్గాలకు అతీతంగా దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. దేశమంతా లాల్‌బహదూర్ వెనుక నిలిచింది. పాకిస్థాన్ యుద్ధంలో పరాజయం పాలయింది. దేశమంతా విజయోత్సవాలు జరిగాయి. ఢిల్లీలో జరిగిన ఒక విజయోత్సవ సభలో ప్రసంగిస్తూ లాల్ బహదూర్ “జై జవాన్ – జై కిసాన్” అనే నినాదాన్ని ఇచ్చాడు. దేశం సుఖంగా – సుభిక్షంగా ఉండాలంటే జవానులు, కిసానులు ఆనందంగా ఉండాలని వారు భావించారు. రైతులపట్ల, వ్యవసాయం

పట్ల అపారమైన సానుభూతి కలిగినవారు కావడంతో ఆయన 17 వ రాజ్యాంగ సవరణను గురించి కిమ్మనలేదు. అంతే, అది చెత్తబుట్ట పాలయింది. కానీ దురదృష్టవశాత్తూ ఏడాది తిరగకముందే తాష్కెంట్ వెళ్ళిన లాల్‌బహదూర్ అక్కడే 11.1.1966న పరమపదించారు.

1967 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రంగా గారు స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా చిత్తూరు నుండి పోటీ చేశారు. కానీ పరాజయం పాలయ్యారు. వారిని పార్లమెంటుకు పంపాలనే ఉద్దేశంతో శ్రీకాకుళంలో విజయం సాధించిన సర్దార్ గౌతులచ్చన్న తన లోకసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. వెంటనే జరిగిన బై ఎలక్షన్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుండి రంగా గారు విజయం సాధించారు. ఆ ఎన్నికలలో స్వతంత్ర పార్టీ ప్రతిపక్షంలో నిలిచే అతిపెద్ద పార్టీగా అవతరించింది. రంగా గారు అతి పెద్ద ప్రతిపక్షానికి నాయకునిగా వ్యవహరించారు. 1966 లోనే ప్రధానమంత్రిగా ఎంపికైన ఇందిరాగాంధీ 1967 లో జరిగిన ఎన్నికలలో విజయదుందుభి మ్రోగించింది. ఆమె తన పదవీ కాలంలో ఒక్కసారికూడా 17వ రాజ్యాంగ సవరణ చట్టం గురించి ఆలోచించలేదు. చట్టం శాశ్వతంగా సమాధి అయింది. ఆ కారణంచేతనే రంగా గారు ఇందిరాగాంధీ పట్ల అభిమానం పెంచుకున్నారు. స్వతంత్ర పార్టీకి కొంతమంది తన అనుయాయులు పదవీ వ్యామోహంతో పార్టీలు మారడం, కొంతమంది ధనికులకు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించడం ఆయనకు బాధకలిగించాయి. 1971 లో జరిగిన మధ్యంతర సార్వత్రిక ఎన్నికలలో శ్రీకాకుళం నియోజకవర్గం నుండి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా నిలబడి ఓటమి పాలయిన రంగా గారు ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలోకి మారి ఇందిరాగాంధీ నాయకత్వాన్ని ఆమోదించారు.

1977 నుండి 1979 వరకు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించిన రంగా 1980, 1984, 1989 సంవత్సరాల్లో సంవత్సరాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుంటూరు నియోజకవర్గం నుండి ఎన్నుకోబడ్డారు. 1991లో గుంటూరు నుండి ఓటమిపాలయ్యారు.

రైతులు ఏ దేశంలో ఉన్నా ఎలా సంతోషంగా ఉండాలని రంగా గారు ఆశించారో, తన సిద్ధాంతాలు పాటించే తన శిష్యులు తెలుగుదేశంలో ఉన్నా, మరో పార్టీలో ఉన్నా ఉన్నతిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

పార్లమెంటు సభ్యునిగా కొనసాగుతూనే కామన్వెల్తు పార్లమెంటరీ మహాసభకు 1969లో భారత ప్రతినిధిగాను, అదే సంవత్సరం గాంధీ శతజయంతి ఉత్సవాల ప్రతినిధిగా సూడాన్, ఈజిప్టు, ఫ్రాన్సు, యు.కె. దేశాల్లో పర్యటించారు. 1983లో మిత్రరాజ్య సమితి అసెంబ్లీకి భారత ప్రతినిధివర్గ ఉప నాయకునిగా వెళ్ళివచ్చారు. 1983లో ఢిల్లీలో జరిగిన అలీనరాజ్యాల సభకు భారత ప్రతినిధివర్గ సభ్యులుగా పాల్గొన్నారు. 1983లోనే ఇండియా–శ్రీలంక ఒడంబడికపై సంతకాలు చేయడానికి ప్రాతినిథ్యం వహించారు. అదే సంవత్సరం ఆఫ్ఘనిస్థాన్ వెళ్ళి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అంత్యక్రియలలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ రంగా గారిని మిక్కిలిగా గౌరవించింది. పార్లమెంటరీ పార్టీ ఉపనాయకునిగా ఉండడానికి అవకాశం కలిగించింది. ఆయన 1980 నుండి 1990 వరకు ఆ పదవిలో కొనసాగారు.

ప్రతి జాతికి సమస్యలుంటాయి. సమస్యలు పరిష్కరించడానికి మహాత్ములు ఉదయిస్తూనే ఉంటారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి గాంధీ పుట్టినట్లు, దక్షిణాఫ్రికాలోని నల్ల జీతాయులకోసం నెల్సన్ మండేలా ప్రభవించినట్లు భారతదేశంలోని రైతుల సమస్యలపై పోరాటం చేయడానికి రంగా ఉద్భవించారు. జీవితమంతా రైతు పోరాటాలతో అలసిన ఆయన 95 సంవత్సరాల సంపూర్ణ జీవితం గడిపి 1995 జూన్ 8వ తేదీన పరమపదించారు.

స్వర్గలోకం అంటూ ఉంటే, అక్కడ వ్యవసాయం చేసే రైతులు ఉంటే, ఆ రైతులకు అన్యాయం జరుగుతూ ఉంటే రంగా గారు అక్కడ కూడా పోరాటం చేస్తూనే ఉంటారు. ***ఆయన జన్మ ధన్యం. ఆయన పుట్టిన ఆంధ్రదేశం ధన్యం.***

☆ ☆ ☆

# అనుబంధం

## రంగా గారి జీవితంలో ముఖ్య ఘట్టాలు

1926–30 ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవ ఆర్థిక సలహాదారు మరియు స్పెషల్ ఆఫీసరుగా ఉన్నారు.

1927–30 ప్రధాన ఆచార్యునిగా, ఆర్థిక శాస్త్రంలోను, రాజకీయ శాస్త్ర విభాగంలోను మద్రాసు విశ్వవిద్యాలయంలో ఉన్నారు.

1928–30 అఖిల భారత వయోజన విద్యాసంస్థ–వ్యవస్థాపక ఉపాధ్యక్షులు.

1930 కేంద్ర శాసనసభకు ఎన్నికయ్యారు.

1930–51 అఖిల భారత కాంగ్రెస్ సభ్యులు.

1933 రాష్ట్ర కేంద్ర భూమి తనఖా బ్యాంకు డైరక్టరు, మద్రాసు ప్రభుత్వంలో ఉన్నారు.

1935–45 కేంద్ర శాసనసభలో ఉన్నారు.

1946–51 ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నారు.

1947–51 అఖిలభారత కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు.

1933 ఇండియన్ పెజెంట్ ఇన్‌స్టిట్యూట్, నిడుబ్రోలుకు – ప్రధానాచార్యులుగా ఉన్నారు.

1935 ఆల్ ఇండియా కిసాన్ మహాసభ – ఫైజపూర్‌కు – అధ్యక్షులుగా వున్నారు.

1936 ఆల్ ఇండియా కిసాన్ సమ్మేళన్‌కు వ్యవస్థాపకులుగా, అధ్యక్షులుగా ఉన్నారు.

| | |
|---|---|
| 1940 | రాష్ట్ర చేనేత సహకార సంఘాధ్యక్షుడుగా, అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ఉన్నారు. |
| 1947 | అఖిల భారత రూరల్ పీపుల్స్ ఫెడరేషనును స్థాపించారు |
| 1946–50 | కేంద్ర శాసనసభలో ఉన్నారు. పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి |
| 1947–50 | ఆర్థిక సంఘంలో ఉన్నారు. |
| 1947–51 | ప్రొవిజనల్ పార్లమెంటులో ఉన్నారు. |
| 1950–51 | ఎస్టిమేట్సు కమిటీలో ఉన్నారు. |
| 1947–85 | అఖిల భారత చేనేత కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నారు. |
| 1952–56 | రాజ్యసభకు ఎన్నికైనారు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. |
| 1957–62 | రెండవ లోక్‌సభలోపార్లమెంటుకు ఎన్నిక |
| 1958–59 | చైర్మన్ : పబ్లిక్ ఎకౌంట్సు కమిటీ – పార్లమెంటులోని నాయకులందరిచే మన్ననలు |
| 1962–67 | మూడవ లోక్‌సభకు ఎన్నిక |
| 1967–70 | నాల్గవ లోక్‌సభకు ఎన్నిక. |
| 1967–68 | పార్లమెంటులో అతిపెద్ద ప్రతిపక్షగ్రూపుకు నాయకుడుగా ఉన్నారు. |
| 1977 | జాతీయ వ్యవసాయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు |
| 1977–79 | రాజ్యసభకు ఎన్నిక |
| 1980–84 | 1984–89 మరియు 1989లో మరలా పార్లమెంటుకు ఎన్నిక. |
| 1980–90 | పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీకి ఉపనాయకులుగా వ్యవహరించారు. |

చట్ట సభలైన, పార్లమెంటు, రాజ్యసభల్లో, ప్రజల కొరకు నిర్విరామంగా కృషిచేస్తూ బయటకూడా అనేక కార్యకలాపాలు రైతు, గ్రామీణ జనాలకై నిర్వహించి,

అవిశ్రాంతంగా పోరాడారు. అంతేగాక అనేక అంతర్జాతీయ సభల్లోను, వేదికలపైన ఉపన్యసించి తమ అమూల్య సలహాలనిచ్చారు.

1946 ప్రపంచ వ్యవసాయదారుల మహాసభ లండన్‌కు భారత ప్రతినిధిగాను

1947 కోపెన్ హాగన్ లో 1949 – గల్ఫ్ దేశాల్లోను, కెనడాలోను 1959

1984 ఢిల్లీలోను భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఇంటర్నేషనల్ వ్యవసాయ ఉత్పత్తి సమాఖ్యకు మెంబరుగా ఉంటున్నారు.

1948 ప్రపంచ కార్మిక సదస్సు, శాన్ ఫ్రాన్సిస్‌కోకు – భారత ప్రతినిధి.

1957 సహకార కాంగ్రెసు – బల్గేరియాకు – భారత ప్రతినిధి.

1954–69 కామన్వెల్తు పార్లమెంటరీ మహాసభకు – భారత ప్రతినిధి.

1964–65 ఉమ్మడి దేశాల పార్లమెంటరీ మహాసభ ప్రతినిధి

1969 గాంధీ శతజయంతి ఉత్సవాల ప్రతినిధిగా సూడాన్, ఈజిప్టు, ఫ్రాన్సు, యు.కె. దేశాల్లో పర్యటించారు.

1983 మిత్రరాజ్య సమితి అసెంబ్లీకి భారత ప్రతినిధి వర్గ ఉపనాయకునిగా వెళ్ళారు.

1983 అలీన రాజ్యాల సభ – ఢిల్లీకి – భారత ప్రతినిధి వర్గ సభ్యులు. ఇండియా – శ్రీలంక ఒడంబడికపై సంతకాలు చేయడానికి ప్రతినిధి. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అఫ్ఘనిస్థాన్ అంతిమ క్రియలకు భారత్ తరపున ప్రతినిధి.

1949 అంతర్జాతీయ వ్యవసాయదారుల సమస్యలు చర్చించడానికి

అమెరికా అధ్యక్షులు హారీట్రూమన్‌తో సమావేశం, మరియు గాంధీ శాంతి సంఘ సభ్యులుగా అనేకదేశాల్లో గాంధీ సందేశాన్ని వినిపించారు. గాంధీ స్మారకనిధి సంస్థకు అధ్యక్షులుగా ఉన్నారు.

☆ ☆ ☆

## రంగా గారు పొందిన అవార్డులు

1983 1. రాజాజీ రత్న అవార్డు

2. భారత వయోజన విద్యాసంఘం జవహర్‌లాల్ నెహ్రూ లిటరసీ అవర్డు

1991 ఇండో జపనీస్ సంస్థ టోక్యో, ఓస్కా అవార్డు.
పద్మ విభూషణ్

సుదీర్ఘకాలం 60 సంవత్సరాలపాటు పార్లమెంట్ సభ్యులుగా సేవ చేసిన సందర్భంగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు.

2001 రంగా గారి స్మృత్యర్థం ప్రత్యేక పోస్టల్ స్టాంపు విడుదల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగా జన్మదినమైన నవంబరు 7వ తేదీని రైతు దినోత్సవంగా ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంగా నామకరణం చేసి రంగా గారిని గౌరవించింది.

☆ ☆ ☆

## రంగా గారి రచనలు

1) Labour in South India - 1934, 2) Maidan speech of Ranga in Parliament - 1930, 3) Kisan Hand Book - 1938, 4) Kisan Speeks - 1938, 5) Jamindari Rythu - 1940, 6) Histroy of Kisan Movement - 1940 7) Adhunika Rajyangamulu - 1945, 8) Telugu Pakistan - 1945 , 9) Peasants visus controls - 1945, 10) Economic condition of Jamindar Ryots, 11) Economic condition of Indian Villages-Vol - I, 12) Economic condition of Indian Villages-Vol - II, 13) Economic condition of Indian Villages-Vol - III, 14) Outlines of National Revolutionary path, 15) World role of National Revolutionary path-1946, 16) Tribes of Nilgiris - 1946, 17) Communists and Kisans - 1946, 18) Gandhian way of Planning - 1946, 19) Revolutionary Peasant - 1947, 20) Colonial and coulered peoples freedom front, 21) Modern Indian Peasant, 22) Kisan Mazdoor Praja Raj - 1947, 23) Peasants and Congress, 24) Students and Congress - 1948, 25) Towards World Peace - 1957, 26) Credo of World Peasantry - 1957, 27) Panchayat Landlordism versus Peasant Economy, 28) Storm Bursts on Peasantry - 1959, 29) Shahakara Vyvasayam-Ranga+Paruchuri - Translated by -Jasti Jagannadham, 30) Why Ranga Resigns - 1959, 31) Self Employed Sector - 1959, 32) Prajaswamyam - 1960, 33) Truteeya Pranalika Communistic Margam - 1960, 34) Freedom in Peril - 1961, 35) Fight for Freedom - 1968, 36) Bapu Blesses - 1969, 37) Kakatiya Nayaks - 1971,

38) Agony and Solace - 1974, 39) Bharatidevi Smruthulu - 1975, 40) World Food Insurance - An appeal - 1975, 41) Natural Calamities, 42) Distinguished Acquaintances Vol-1 - 1976, 43) Distinguished Acquaintances Vol-II - 1976, 44) Rajendra Prasad Memorial Lecture - 1981, 45) Telugus heroic Role in the World - 1981, 46) Laxmi Narayana - 1981, 47) Prof. Ranga at U.N. - 1982, 48) Protect Self employed peasants and tribal people - 1983, 49) Ranga Rachanalu - 1987, 50) Panchayat Bhuswamyam - Rythu Swamyam, 51) Congress Path to national disaster - Ranga and Gayathri, 52) Crop Targets, 53) Pasuvula Bheema Padhakam - Ranga and Sivaji, 54) V. Rama Krishna - A tribue, 55) Revolutionary Peasants, 56) India in the U.S., 57) Quintessence of non-aligned movement, 58) Monograph on Parliamentary democracy, 59) Arial view of USSR and Yogoslovia, 60) Biography of Kisan - Gorrapati, 61) Gandhian Plan, 62) Rajaji - Sardar Patel - Jawaharlal Nehru, 63) Prakasam, Giri, Sri Prakash - Freedom Fighters, 64) Settipalli Songs, 65) Harijan Nayakudu, 66) Indian Education Movement.

☆ ☆ ☆

### రంగా గారి గురించి

# ప్రముఖులు రచించిన కవితలు

## పద్య సుమాంజలి

తెలుఁగుం గడ్డనె కాదు భారతమునందే కాదు సర్వక్షమా
వలయం బందును "రైతుపాలఁ గల డెవ్వం"డన్న నిన్నేకదా
తొలుతం జెప్పెద-రిట్టి నీవు తెనుఁగుం దోబుట్టువై మా తపం
బులు పండించి తె! వాసికిన్ దగిన కాపుంజూపె నీ సేద్యముల్

తెలుఁగు నుడికార మందున్న మెలపు నెఱిఁగి
తెలుఁగు హృదయంబు నందున్న తీపి నెఱిఁగి
తెలుఁగు సంస్కృతి యందున్న చెలువ మెఱిఁగి
తెలుఁగునకు నీవు సరిక్రొత్త వెలుఁగు లిడితి

నాలుగు కోట్ల తెల్గు లొక నాయఁకరమ్మున వెల్గునాడు పాం
చాలముఁ దొట్టి ద్రావిడ, మసాము దొడంగి మరాట దాఁకనీ
నేలకు సాటి వచ్చు నవనిం గనుఁగొందుమె? యాంధ్రజాతి కీ
మేలు ఘటింపు మంచుఁ బ్రణమిల్లెద దుర్గకు నిష్టభర్గకున్

నిను దేశభక్తుఁగా మె
చ్చిన వారలు కలరు మహి నశేష ప్రజ; లీ
వొనరించిన భాషాసే
వ నెఱింగిన వార లెన్ని వందలు కలరో!

కవి యెవఁడో ప్రజాభ్యుదయ కాముకధీపరిణద్ధుఁ డెవ్వఁడో
ప్రవిమల వృత్త దీప్తి పరిభాసురుఁ డెవ్వఁడొ నిగ్గు దేల్చు వా

రవనికి నేతలై వెలసి నప్పుడె ధర్మువు గెల్చు గారడీ
రవరవ లిచ్చుటం బనికి రావు కులమ్ములు గావు నిచ్చెనల్

రాచటికమ్ము సేయుటకు రైతొకఁడే తగు నంచు ధర్మముం
బ్రోచు నతండ యంచు, మన పూజలు కొన్న గురుండు కాయముం
ద్రోచుచుఁబల్కె గాంధి; ఋషితుల్యుఁ డతండు మనమ్ములో నినుం
జూచియ చెప్పె నట్లనుట సూనృత మోయి! జగద్ధితాగ్రణీ

ఢిల్లీ లోపల నున్న శీతనగ పీఠిన్ టోకియో వీథిలో
నిల్లుం గట్టిన రూజవెల్టు మహిలో హిట్లర్ కడన్ గాలమున్
వెళ్లం బుచ్చిన నూర్ధ్వ లోకములకే వేంచేసినన్ దెల్గువాఁ
డుల్లంఘింపఁగ రాదు తల్లిపలు కెట్లో రక్ష సేయం దగున్.

కడపన్ నిద్దుర లేచి హస్తిపురిలో కాఫీని సేవించి చే
రెండు రొట్టెన్ కెయిరో కడ న్నమలి పారిస్ పూఁటకూ టింటిలోఁ
గడువు న్నింపి హితోక్తు లాడును ట్రుమన్ కల్పించు దర్బారులో
నిఁడుబ్రో లీసుతుఁ డెట్లు వచ్చె జననీ! నీ శక్తిఁ గాకుండినన్

చక్రవర్తుల ముత్యాల శాలయందు
నగ్రహారాల నడిబొడ్డులందుఁ గులుకు
కవులు కనలేని తెలుఁగు చక్కందనమ్ము
చూఱలాడిన శారదాసుతుఁడు వీవు

పల్లెటూరఁ బుట్టి పల్లెల సేవించి
బీదవారి కులము పేదవారి
పలుకు గుట్టెఱింగి పస గల జాతీయ
రచన సేయు సుకవి రాజవీవు.

**– తుమ్మల సీతారామమూర్తి**

(అభినవ తిక్కన)

# ఘన యశోధుర్యుఁడు

శ్రీ లారోగ్యము దీర్ఘ మాయువు యశ
శ్శ్రేయమ్ము లందిచ్చి, దే
వాళీ మౌళి మణిప్రభాలసిత పా
దాబ్జుండు. సర్వేశ్వరుం
డేలుంగావుత గోగినేనికుల వా
ర్థీందున్, రైతుబంధున్, ప్రజా
వ్యాలోలున్, ఘను, పంచసప్తతి శర
ద్భ్రాజిష్ణు, రంగాహ్వయున్

మాతృధరిత్రి దాస్యమున
గ్రగ్గి కలంగెడివేళ బాంధవ
వ్రాతము నర్థమున్ తుదకు
ప్రాణములన్ విడనాడ జంకకా
మాతృవిముక్తి కంతయు స
మర్పణ చేసిన వీరపుత్ర పు
త్రీతతి నీ అభిఖ్య తొలి
రేఖననిల్చి తురంగలించెడిన్

అచార్యుండవు విద్యలందు విబుధేం
ద్రాచార్య వర్యున్ లస
ద్ధీచాతుర్యమునందు మించెదవు నే
తృత్వంబునన్ గానరా

రేచాయన్ నినుఁబోలుదక్షులు వచో
హిస్వామి! సార్ధక్యముం
దోచెన్ నీజని ధన్యమై ఘన యశో
ధుర్యుండవౌ దన్నిటన్

సభల నీ వుపన్యాస మొసంగు నప్పు
డరటిపండొల్చి పెట్టినయట్టు లెల్ల
రాజకీయార్థికాది మర్మములు చెప్పి
శ్రోతలకు జ్ఞాన మోదముల్ చూఱయిత్తు

నిరతం బీవొనరించు సేవల సమున్మేషంబు ప్రాపించు బం
ధుర కీర్తింగొను దేశమాత దయచే, తుష్టాత్మమై మేటి యా
దరముంజూపు జనాళి దీవనలచే, దార్ఢ్యంబు నారోగ్యముం
బరమానందమునొంది యొప్పు మనఘాత్మా! రంగనాథాహ్వయా

– ***డా॥ దివాకర్ల వేంకటావధాని***

# రైతు జూడకపోతే

యావద్భారత కర్షకోద్యమ విధాతా! సూత్రధారుండవై
నీ వాడించిన బొమ్మలెన్నో తెరపై నేఁడెక్కె, నీ యుద్యమ
ప్రావీణ్యమ్మును నీ పరిశ్రమను నీ పట్టుందలం జూచి మా
దేవుండన్నవి రైతు లోకములు కీర్తించెన్ దిగంతమ్ములున్

కలవిక ముందు నీ ప్రభకు గంటలు గట్టుక రంగయంచు మా
కులికెడు రోజు లిప్పటికె కొన్ని శతాబ్దులు ముందుకేగి నీ
పలుకులు కొల్పులయి భారతమెల్ల గ్రమించెరా! మహో
జ్జ్వల విజయ ప్రశంస లోకపట్టున గుమ్మయి గుబ్బతిల్లఁగన్.

– ***ఏటుకూరి వేంకట నరసయ్య***

# మంచి మనిషి

భారత రైతవాణి
పలికిందెక్కడినుండి?
జమీన్ రైతు కేక తొలుత
వినిపించిందెచటి నుండి
అది రంగా వాక్కు నుండి
అది తూరుపు దిక్కునుండి

వ్యక్తి గౌరవాన్ని బట్టి
మంచి నడవడినిబట్టి
ఏ పార్టీ వాడైతేనేం?
ఏ కులమ్ము వాడైతేనేం?

స్వాతంత్ర్యానికి సర్వం త్యాగం జేసిన జోదుకు
రైతు కూలీ హక్కులపై
పోరాడిన బాంధవునకు
జన్మ దినోత్సవ మంటే
సంతోషించని దెవరు?

కలకాలం మనవలెనని
అందరు రంగాగారికి
అభినందన లంపుతారు
ఆశీస్సుల నింపుతారు

– శ్రీ కొసరాజు రాఘవయ్య చౌదరి

# ప్రశంస

హరి హరి! యంధ్ర దేశ మపహాస్యము పాలయిపోవఁ జొచ్చె నిల
దఱు యువ నాయకోత్తముల దందడి సందడిలో మునింగి; ....
వ్వరు పనిఁబూని దేశ మొక పద్ధతిలో సరిదిద్ద నేర్చువా
రరయఁగ లేరె? దేశమున కాఱడి తెచ్చుట యిచ్చగింతురే?

తల కొక గడ్డపట్టి పెడదారులు త్రొక్కి 'పరాయి' వారి త
ప్పులు పెకలించి ఢీకొనుచుఁ బోయిన దేశ మదెట్లు కోలుకో...
గలదు? త్రిలింగ నాయకులు కత్తులు నూఱుట మాని యైక్యమున్
గలిగి మెలంగినప్పుడే జగంబున, వారికి 'నుప్పు' పుట్టెడున్!!

'సహకారంబను' సూత్రమందొక మహాసారస్యముం దేల్చి య...
స్వహమున్ గొప్ప నినాద మిత్తురు 'ఘనాపాఠుల్' మహా నాయకుల్

కుహనా లాభము లేవో లెక్కలకుఁ బెక్కులు చూపఁగా వచ్చు....
మ్మహిలో నాచరణంబె ముఖ్యమని యే మాత్రంబు నూహింతురే

వాహిని! నీవు సర్వపరిచారము సిద్ధము చేసికొంచు న
న్వాహములోన నుండుటయె న్యాయము; రైతున కేది లాభమో

ద్రోహమొ చెప్పఁగాగలుగు ధోరణి నేఁడు గతించె, నీకే యీ
సాహస మున్నదమ్మ జవసత్త్వము లింకము నీకుఁ గల్గుతన్!

సేద్యము నేఁడు సర్వజన సేవ్యము కావలెనంచు దేశమం
దుద్యమ ముద్భవించినది; యూరక కన్నులు మూసికొన్న – సా
రథ్యము మానుకొన్న నపరాధము చేసిన యట్టె యెంచుటే
తథ్యము కాన వాహిని! యథావిధిఁ గత్తిని నూఱియుంచుమా!

రైతున నెవ్వఁడో యెఱుఁగరాని మహామహు లేకమౌచు నా
పాప మనోజ్ఞమైన యెక బాటను సృష్టి యొనర్చి దానిలో

నైతిక సూత్రమున్ విడిచి న్యాయమొ గీయమొ దాని లాభమున్
జూతమటంచు గోచులెగఁజుట్టిరి వాహిని! కాచుకొమ్మిఁకన్!

నీ వుదయించి నేఁటికిఁ గనీసము 'పావు శతాబ్ది' యయ్యె, దే
శావసరమ్ము లిమ్ముగ స్వయమ్ము గ్రహించి ప్రబోధమిచ్చి సౌ
ఖ్యావహమైన బాట కొఱక హద్దును జూపితివమ్మ వాహినీ!
నీవిఁక ధన్యురాలవు మనీషులు మెత్తురు నీదు వైఖరిన్.

– *పండిత సత్యనారాయణ చౌదరి*

❖ ❖ ❖

## ఆచార్య రంగా

తను రక్తంబు కిసాను రైతుల హితార్థంబై, యహోరాత్రు ల
ప్పన గావించు కిసాను వీరుడవు, నిస్వార్థుండ, వీ వుద్భవిం
చిన యానంద దినంబునం బులకరించెన్ దేశ; మో రైతుమం
డన! రంగాభిధ! వర్తిలం దగు ననంత బ్రహ్మ కల్పాంతమున్

రైతు రంగా యన్న ఖ్యాతి కుళ్ళాయిగా
దాల్చిన దీన బాంధవవిధుండు
బాపూజీ దివ్య జిహ్వా ప్రశంసలనంది
చెరసాల ముద్ర దాల్చిన ఘనుండు
ఆచార్య పీఠంబు నరకాల నెగజిమ్మి
తల్లిని నారాధించు త్యాగధనుండు
జాతీయ కళల కాస్కారంబు గల్పింప
నుబలాటపడు రసజ్ఞోత్తముండు

అన్యదేశయాత్ర లాచరించి విశాల
చిత్తవృత్తి గడన చేసినట్టి
ప్రతిభ చరితుడై రంగా మనీషి
వర్ధిల్లుగాత; నుతుల పల్లకీల.

*- నవయుగ కవి చక్రవర్తి:పద్మభూషణ్, జి. జాషువ*

## అతడు అతడే!

అతడు నా ఆంధ్రానికే కా
దఖిల భారత జనులకే కా
దవని యందలి శ్రమిక కోటికి
అచ్చమగు ఒక నేత యందును

అతడు కర్షకు స్వేద బిందువు
అగ్ని కణమని చాటి చెప్పెను
అతడు కార్మిక శ్రమ సింధువు
ఆమేయంబని గొంతు విప్పెను-

లోక కార్మికులంత ఒకటను
కేకయే మార్క్సుకు పతాకము
"భూతలంబున రైతులొక్కటె"
నేత రంగా కిది ప్రతీకము

పంటలెరుగును - మెరకచేలో
గుంట కెరుగును - ఎద్దుమెడలో
గంటలెరుగును - రైతు ఆకలి
మంటలెరుగును అతడెవరంటే-

రైతుకూలీ ప్రజారాజ్యపు
రాగ రంజిత వదనుడాతడు
సర్వమానవ లొక్క టేయను
శ్రమిక రాజ్యపు సదనుడాతడు

నాడు గాంధీ బాటలో నడ
యాడి దేశపు స్వేచ్ఛ గోరెను
జైళ్ళలందున క్రుగ్గి దాస్యపు
సంకెలలు ఛేదించివైచెను –

కోష్టమున బసవన్న ఎరుగును
కోంద్రలో నాగేలు ఎరుగును
చద్దిమూటతో పొలముగట్టున
సాగు కాపుల పడతి ఎరుగును –

పంటకాలువవోలె మెల్లగ
పారుటన్నది అతడెరుంగడు
ఎత్తుకొండల దూకునొక సెల
యేరు చందము – అతని డెందము

అతడొక సిద్ధాంత కర్తే!
అతడొక రాద్ధాంత వక్తే!
ఎన్ని యైననుగాని శ్రామిక
యెదదలను మీటెడి ప్రవక్తే!

నమ్ము సిద్ధాంతమ్ము వేదము
న్యాయమడుగుటెవాని వాదము
తాడితులకై పీడితులకై
ధర్మ మొనగూర్చుటె నినాదము

మొగ్గలెరుగును - ఎడ్లు కొమ్ముల
పగ్గ మెరుగును - దుత్తకట్టిన
ఉగ్గమెరుగును - ఏరువాకల
లగ్గమెరుగును - అతడెవరంటే-

మట్టి పిసికెడు వానినెవ్వడు
మహారాజుగా మలచ దలచెను?
చెమట దడిసిన బట్టి నెవ్వడు
సిరుల గంధము గాగ దలచెను?

ఒక్క నాడతి వాదశక్తుల
ఉక్కు కౌగిట ప్రజాస్వామ్యపు చిక్కదనములు చిక్క, ర
క్షించి బ్రోచిన దెవ్వడు?
పదవి తానై వలచివచ్చిన పెదవి విరచి తిరస్కరించిన
వసుధలో నిష్కామ సేవా పరాయణుడతయెవ్వడు?
పరాయణుడతడెవ్వడు?

ఆరువదేండ్లుగ ప్రజా సేవకు
అంకితమయినట్టి జీవము
ఈ ప్రపంచ చరిత్రలో నది
ఎక్కడో అరుదైన విషయము-

అతని కానందమ్ము ఎప్పుడు?
అతని కారోగ్యము ఎప్పుడు?
ఎపుడు తన ఆశయ చయమ్ములు
సఫలమయి జయమందినప్పుడు?!

గొర్రులెరుగును - సాగునాగలి
కర్రులెరుగును - అరకదోల్ములు
గర్రలెరుగును - ఎడ్ల కందిన
అర్రులెరుగును - అతడు రంగాజీ!

విశ్వ శ్రామిక నేతజయహో!
భరత కర్షక భ్రాత జయహో!
జయము మీకగు సకల పీడిత
జన హృదయపు నయకిరీటి!
జయము జయమోహో!

*- నాగభైరవ కోటేశ్వరరావు*

❋ ❋ ❋

## ఓ పొడిగింజ కథ

కొంతమంది తమ గతాన్ని బుద్ధి పూర్వకంగా మరచిపోతారు. మరికొంతమంది తమ గతాన్ని, చాలా జాగ్రత్తగా పదిలపరచుకొంటారు. గత కాలంలోని తమ అనుభవాల నుండి, ఎన్నో పాఠాలను నేర్చుకుంటారు. ఆ పాఠాలను మెట్లుగా మలుచుకొని, మెలమెల్లగా ముందుకు పాకుతూ ఉంటారు.

ఇలాంటి వారంటే నాకు చాలా ఇష్టం!
ఇలాంటి వారంటే నాకు చాలా చాలా ఇష్టం

గతాన్ని బుద్ధిపూర్వకంగా మరిచిపోయే వారిలో, ప్రధానంగా రెండు లక్షణాలు కనబడతాయి. ఒకటి ఆత్మ వంచన. రెండవది పరవంచన.

ఇలాంటి వారంటే నాకు చాలా అసహ్యం!
ఇలాంటి వారంటే నాకు నాకు పరమాసహ్యం!

నేను అసహ్యించుకొనే వారు, అసలే లేరని కాదుగానీ, ఆ సంఖ్య కన్నా నేను అభిమానించే వారి సంఖ్య, నేను ఆరాధించే వారి సంఖ్య ఎక్కువ - చాలా ఎక్కువ!

అట్లాగే- నేను అభిమానించే వారిలో, ఆ చిన్న మొక్క కూడా ఉంది! నాకూ ఆ మొక్కకూ ఎలాగో పరిచయమయింది. ఆ పరిచయం స్నేహంగా మారింది. ఆ స్నేహం గాఢమయిన మిత్రత్వంగా మారింది.

మా స్వభావాలు, మా అనుభవాలు, మా అభిరుచులు, ఒక్కలాగా ఉండడమే అందుక్కారణం కావచ్చు. ఆత్మీయుల ముందు, దాచుకోవలసినవేవీ ఉండవు. గనుక నా గురించిన వివరాలన్నీ, ఆ చిన్న మొక్కకు నేను చెప్పుకున్నాను.

క్షమించండి! మీరు చెప్పినవన్నీ వింటుంటే, మీకూ, నాకూ అట్టే తేడాలేమీ కనిపించడంలేదు. ఒకరకంగా నేనూ దిక్కు మొక్కులేని దాన్నే, నేను విత్తనంగా ఉన్నప్పుడు అయినవారందరూ, నన్ను రోడ్డంటా తోసేసినపుడు దిక్కుతోచక బిక్కచచ్చిపోయాను. పిక్కటెల్లిపోయాను. “అయ్యో పాపం” అన్నవారే కరువయ్యారు. పిసిరంత నీడే లేక ఇంకో పిసిరంత తేమ లేకా, నేను జీవన్మరణాల సరిహద్దు మీద నిలిచినపుడు ఓ చినుకు ఓ చిన్న వాన చినుకు నామీద వాలింది. నన్ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొంది. నాకన్నీరు తుడిచింది. నా తల నిమిరింది. “జాగ్రత్తగా బ్రతుకు” అంటూ నా భుజం తట్టింది. నన్ను సారవంతమైన మైదానం మీదికి వదిలింది. తరువాత నేను మొక్కనయ్యాను. అని కన్నీరు నింపుకొన్నదామొక్క.

అసలు సంగతి ఆలస్యంగా చెబుతున్నందుకు నన్ను మన్నించండి!

ఆ విత్తనం పేరు - భరధ్వాజ!

ఆ వాన చినుకు పేరు - ఆచార్య రంగా!!

**- డాక్టర్ రావూరి భరద్వాజ**

# అక్షర నీరాజనం

కర్షక జన బంధువతడు
ప్రజా హృదయ నేత అతడు
ఉద్యమాల స్ఫూర్తి అతడు
పల్లె ప్రజల ప్రాణమితడు

తన చదువుల సాదమెల్ల
పీడిత జన శ్రేయమునకు
ప్రజాస్వామ్య సంరక్షకు
మీ దెత్తిన త్యాగి అతడు

గాంధేయమ్మతని మతం
లోక సేవ అతని వ్రతం
సమ సమాజమతని హితం
అతనిదొక్క దృఢ చిత్తం

లోక్‌సభా సభ్యుడు గా
అరువదేండ్ల అనుభవమ్ము
పండించిన రాజకీయ
దురంధరుడు పండితుండు

జగమెరిగిన మహనీయుని
నామమ్మొక స్వర్ణాక్షరి
జనావళికి అంత్యాక్షరి
అతడే **ఆచార్య రంగ.**

**– జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

## రైతు ఉద్యమాల ముఖచిత్రం రంగా!

నిదుర్రోలు నడిబొడ్డున. నిలబడి
రైతుల గుండె చప్పుళ్ళకు గొంతు ఇచ్చిన వాడు
దేశం నాలుగు చెరగులా తిరిగి
దాస్యపు సంకెళ్ళు తెంచిన వాడు

జన జీవితంలో ఒకడిగా కలసిపోయి
జాతీయ జెండాను మోసిన వాడు
నల్లరేగడి చేలో నాగలిగాసాగి
అన్నదాతల ఆక్రందనకు స్పందించిన వాడు

పదువుల బరువుకు తూగని వాడు
పైరవీలకు తల ఒగ్గని వాడు
మన తరానికి గర్వమైన వాడు
మానవే సేవే సర్వమైన వాడు

రైతన్నకు వెన్నుగా
కూలన్నకు కన్నుగా
ఆదర్శంలో మిన్నగా
"తొమ్మిది పదుల జీవితంలో
మేడిపిడి" లా భాసించిన ఆచార్యుడు
రైతురంగా మనందరికీ ఆరాధ్యుడు
ప్రజాసేవలో ఖద్దరు నాయకులు
పది తరాలకు వెనకేసుకుంటుంటే
ఉన్నది పోగొట్టుకొని
"ఊలబెండు" గా మిగిలిన ఉన్నద దేశభక్తుడు.

ఎదుటి మనిషి ఆకలితో
ఎలుగెత్తి అరుస్తుంటే
ఎక్కిరిస్తూపోయేలోకంలో

ఎందరినో చేరదీసి
ఆదరించిన ధర్మవీరుడు

రైతు సోదరుల సమస్యలకు నోరిచ్చి
చట్టసభల్లో ప్రశ్నలై ప్రవహించిన
ప్రజా చైతన్య మూర్తి ఆచార్యరంగా
దగా కోరు రాజకీయాల్ని
దరిచేరనీయకుండా
బతుకంతా బంగారంగా
కడిగిన ముత్యంలా భాసించిన మనరంగా

నాగేళ్లకు ఏవమెత్తించి
నాయకుల్లో మేటిగా నిలిచి
అన్నదాతల గుండెల్లో
ఆరని జ్యోతిగా వెలగుతున్న రైతునేతరంగా!

దుత్తకేసిన ఉగ్గానికి తెలుసు
గిత్త కేసిన పగ్గానికి తెలుసు
ఎద్దు మెడలో గంటకు తెలుసు
మెరక చేలో గుంటకకు తెలుసు రైతురంగా త్యాగం

పల్లానికి పారే పంట కాలువకు తెలుసు
గాలి తెచ్చే గంధానికి తెలుసు
పాలి కాపు నుదుటి చెమటకు తెలుసు
రైతు పెద్దరంగా అంతరంగం

ఆచార్య రంగా ఆశయం పల్లవిస్తూనే వుంటుంది
పంటచేలో, పైరగాలి తరగల్లో
ఆచార్యరంగా రూపం నడిపిస్తూనే వుంటుంది
ఆరిపోని దీపంగా అన్నదాతల గుండెల్లో

రైతుల "బతుకు పుస్తకానికి"
రంగాజీవితం రంగుల ముఖ చిత్రం!
రాజకీయపుటాకాశంలో ధృవతారకు
రాగంనిండిన గుండెతో గీసిన అక్షరచిత్రం!!

– బీరం సుందరరావు

## రంగాజీ " దివ్య సందేశం"

| | | |
|---|---|---|
| కష్టమనుచు తలచకుండ | – | కండలు కరిగించునట్టి |
| కర్షకుడా మేలు కొనుము | – | కదనానికి కదలిరమ్ము |
| నిద్రవోవు నిన్ను లేపి | – | భద్రమనుచు వన్నుదట్టి |
| నీ బ్రతుకును బాగుపఱచు | – | నేత లెవరు లేరయ్యా దివికేగిన నన్ను తలచి దిగులు పడక వేవయ్యా! |
| పశుగణాల సాకుచునూ | – | పంటలెన్నో పండించుచు |
| పదవులేమి కోరనట్టి | – | ప్రభువులండి మీరంతా |
| గమ్మున కూర్చొన్న మీకు | – | గత్యంతర మెట్టులుండు |
| రొమ్ము చఱచి రూల్సునుడివి | – | దమ్మును చూపించుకొనగ దివికేగిన నన్ను తలచి దిగులు పడక లెండయ్యా! |
| "జన్మభూమి" పథకంబున | – | "జాతిపిత" కు మక్కువయని |
| జాగులేక, మీరందరు | – | సాధించుడు తరలివచ్చి |
| చంద్రబాబు శ్రేష్ఠుండని | – | జగమంతా అంటుంటే |
| చిత్తములో మురుసుకొనుచు | – | సెటిలైటున నన్ను దిగులు పడక లెండయ్యా! |
| భీతి వదలి మీరందరు | – | చేతులనందించుడయ్యి |
| భీమా పథకాల నతడు | – | భేషుగ చేయించగలడు |

తొల్లి ఇడుమలన్ని మీకు - దూరముగా తొలగి చనును
కల్లలేక మీరెల్లరు - కర్తవ్యము నెఱపుడయ్య
స్వర్ణాంధ్రదేశాన్ని - సత్వరమే కాంచగలరు

నామమ్మొక స్వర్ణాక్షరి
జనావళికి అంత్యాక్షరి
అతడే **ఆచార్య రంగ.**

*- గొరిజవోలు పాండురంగారావు*

❖ ❖ ❖

# అక్షరాంజలి

కల డీ నాటికి రైత బాంధవుడు రంగాయంచు దేశమ్ము చే
తుల మోడ్చెన్, జయవెట్టి శ్రామికులు సంతోషమ్ముతో దివ్య మం
గళ నీరాజన మిచ్చి రాదృతి, జగత్కల్యాణ కాంక్షను షం
గుర పాదాబ్జములొత్తి చిత్తముల విజ్ఞుల్ నిల్పి పూజింపరే!

ప్రతి మాసమ్మున వచ్చు వేతనము సంప్రాప్తించు నైశ్వర్యమున్
బ్రతిరోధించియు స్వేచ్ఛగోరి భరత స్వాతంత్ర్య సంలబ్ధికై
బ్రతుకుంగారకు నప్పగించితివి సర్వస్వమ్ము వోనాడి ఈ
గతి సేవించిన వారలాంధ్రమున రంగా! లేరు ముమ్మాటికిన్

కలవరమంది ముందుగతిగానని వానిని తిండిలేక ప
స్తుల దురపిల్లువాని పరితుష్టిగ నిస్తుల సాహితీ సుధల్
చిలికెడు వాని నొక్కదరి జేర్పగ కంకణ మూను మిమ్ము నా
తలపుల నక్షరాంజలుల దన్పుట ధన్యుడ నైతి నింతకున్

**- కొల్లా శ్రీకృష్ణారావు**

❖ ❖ ❖

## రచయిత పరిచయం



### డాక్టర్ యన్. ఆదినారాయణ

స్వగ్రామం : రావినూతల, ప్రకాశం జిల్లా
చదువు : ఎం.ఎ., పి.హెచ్‌డి.

రచనలు :

1. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం పాతికకు పైగా పాఠ్య గ్రంథాలు
2. మన తెలుగునాడు
3. మదర్ థెరిసా (జీవిత చరిత్ర)
4. రుద్రమదేవి (నవల)
5. అస్త్రసిద్ధి (నాటకం)
6. మన పండుగలు (బాలలకు పండుగల పరిచయం)
7. శృంగార తిలకం (కాళిదాస కృతికి కథానుసరణ)
8. అభినయ బాలగేయాలు (సంకలనం)
9. అహల్యా సంక్రందనము - సమగ్ర పరిశీలనము (సిద్ధాంత వ్యాసం)
10. తెలుగులో బాలసాహిత్యం - సామాజిక ప్రయోజనం (యు.జి.సి. ప్రాజెక్టు రిపోర్టు)
11. పరదేశాల్లో పదనిసలు
12. తెలుగు తెలుసుకో - తెలివి పెంచుకో

సంపాదకత్వం : నాగభైరవం
(డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు సమగ్ర కవిత్వం - మూడు సంపుటాలు)

అవార్డు : రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు

ఉద్యోగం : ఒకప్పుడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా డిగ్రీ కళాశాల, తాడికొండలో వివిధ హోదాలలో బోధనం - పాలనం. ఇప్పుడు సాహిత్య సేవతో విశ్రాంత జీవనం.



రంగా - భారతీదేవి రంగా